
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 8 ఫిబ్రవరి 2024




ఆశీర్వదించండి.. ప్లీజ్!

సొంత నియోజకవర్గంలో సొంత పార్టీలోనే తీవ్ర అసంతృప్తిని ఎదుర్కొంటున్న రోజా, వ్యూహాత్మక ఓట్ల వేటాట మొదలు పెట్టారు. కులసంఘాలను కూడగట్టుకునే పనిలో మునిగితేలుతున్నారు. వాళ్లను ఇంటికి పిలిచి విందు పెట్టి, అక్షింతలు చేతికిచ్చి ఆశీర్వదించమని సినిమా స్టయిల్‌లో కోరుతున్నారని ప్రచారం జరుగుతోంది. పుత్తూరు శివాలయం వీధిలో చందాలు వేసుకుని నిర్మించుకున్న బలిజ సంఘం భవనాన్ని ఏడు నెలల క్రితం దేవదాయశాఖ అధికారులు రాత్రికి రాత్రి కూలగొట్టేయడంతో ఆ వర్గం తీవ్ర అసహనంతో ఉంది. వీరిని బుజ్జగించేందుకు ఆ వర్గంతో సమావేశం ఏర్పాటు చేసి, పుత్తూరు గోవిందమ్మ గుంటలో భవన నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, భూమిపూజను కూడా చేసేశారు. తన సొంత ఖర్చులతో పుత్తూరు నడిబొడ్డున శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని కూడా వాగ్దానం చేశారు. రెండు రోజుల క్రితం విజయపురం మండలం నుంచి క్షత్రియ సామాజిక వర్గ నాయకులను సైతం ఆహ్వానించి వారికి చేసిన మేళ్లను వివరించారని తెలిసింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయపురం ఎంపీపీగా లక్ష్మీపతిరాజుకు అవకాశం దక్కకుండా చేశారనే కోపం ఈ వర్గంలో ఇప్పటికీ ఉంది. అలాగే నగరి, పుత్తూరు మున్సిపాలిటీల్లో బలమైన సామాజికవర్గం అయిన మొదలియార్లను ప్రసన్నం చేసుకునేందుకు సైతం పడరానిపాట్లు పడుతున్నారు.ఆ సామాజికవర్గంలో ఆర్థికంగా బలమైన వ్యక్తులను పరామర్శల పేరుతో నగరిలోని వారి ఇళ్లకు వెళ్లి మద్దతు కోరిన రోజా... ఇటీవల ఇంటికి ఆహ్వానించి వారి చేతిలో అక్షింతలు పెట్టి మరీ తనను మళ్లీ ఆశీర్వదించాలని సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించినట్లు చెబుతున్నారు. అయితే, ఆ సామాజికవర్గానికి ప్రధాన జీవనాధారమైన పవర్‌లూమ్స్ పరిశ్రమకు ప్రభుత్వం తరపున ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదనే అసంతృప్తి వారిలో గూడుకట్టుకొని ఉంది. బ్రాహ్మణ సంఘం నాయకులను కూడా ఇలాగే ఆహ్వానించి మద్దతు కోరారని చెబుతున్నారు. రోజా ఇంటికి వెళ్లి అక్షింతలు వేసివచ్చిన ఒక నాయకుడిని పలకరిస్తే, 'నీ పిచ్చిగాని భయ్యా ఈ రోజుల్లో కుల సంఘం నాయకులు చెపితే ఆ సామాజికవర్గం మొత్తం ఓట్లు వేసేస్తారని ఎలా అనుకుంటావు' అని తేల్చేశాడు.

-పుత్తూరు అర్బన్

తిరుమల శేషాచల కొండలను బుధవారం పొగమంచు కప్పేసింది. చలికాలం పూర్తయి త్వరలో వేసవి మొదలవుతున్న క్రమంలో పొగమంచుతో నిండిన తిరుమల కొండలు భక్తులకు కనువిందు చేశాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





దగ్ధమవుతున్న కారు


విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు దగ్ధం

గూడూరు, ఫిబ్రవరి 7 : ప్రమాదవశాత్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఓ కారు దగ్ధమైన సంఘటన గూడూరు మండలం తిప్పవరప్పాడు గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. అగ్నిమాపకశాఖ సిబ్బంది కథనం మేరకు.... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దినేష్‌కుమార్‌పాండే బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబసభ్యులతో కలిసి కారులో జార్ఖండ్‌కు బయల్దేరాడు. బుధవారం తిప్పవరప్పాడు సమీపంలో వెళుతుండగా రోడ్డుపై హఠాత్తుగా కుక్క అడ్డురావడంతో తప్పించబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్‌స్తంభాన్ని ఢీకొన్నాడు. దీంతో కారుఇంజన్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. స్థానికులు కారులో ప్రయాణిస్తున్న దినేష్‌కుమార్‌పాండేతోపాటు, అతడి కుటుంబ సభ్యులు రూపేష్‌పాండే, లలితాపాండే, ఆరూహిపాండేలను కారు నుంచి బయటకు తీసుకొచ్చారు. అగ్నిమాపకశాఖ అధికారి చలమయ్య, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.6లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

మెజారిటీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు ఖరారు

జనసేన నుంచీ స్పష్టత లేక మూడు చోట్ల పెండింగ్

మరో మూడు స్థానాల్లో తుదిదశలో కసరత్తు



ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు కొత్తగా తిరుపతి పరిధిలోకి చేరిన మొత్తం 17 అసెంబ్లీ స్థానాలకు గానూ మెజారిటీ నియోజకవర్గాలకు టీడీపీ అభ్యర్థులు ఖరారయ్యారు. ఇంచుమించు 11 సెగ్మెంట్లలో అభ్యర్థుల విషయంలో అధిష్ఠానానికి స్పష్టత వచ్చింది. స్పష్టత వున్న చోట్ల అభ్యర్థులు ఎన్నికలకు సన్నద్ధం కావడంతో పాటు ఎన్నికల ప్రచారమూ మొదలు పెట్టేశారు. మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక జరగాల్సివుంది. ఇందులో మూడు స్థానాలకు సంబంధించి మిత్రపక్షమైన జనసేనతో కలసి నిర్ణయం తీసుకోవాల్సి వున్నందున వాటిని పెండింగులో వుంచారు. చివరగా మిగిలిన మూడు స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక తుది దశకు చేరుకుంది. మొత్తంమీద మూడింట రెండొంతుల సెగ్మెంట్లలో అభ్యర్థుల విషయంలో స్పష్టత వున్నందున ప్రచార కార్యకలాపాలు జోరందుకున్నాయి.

తిరుపతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా తిరుపతి జిల్లా ఆవిర్భావంతో నెల్లూరు నుంచీ మూడు నియోజకవర్గాలు చేరాయి. దీంతో ఈ 17 నియోజకవర్గాలకు గానూ 11 చోట్ల అభ్యర్థుల విషయమై పార్టీ అధిష్ఠానం ఓ నిర్ణయానికి వచ్చేసింది. కుప్పంలో అధినేత పోటీలో వుంటారనేది చెప్పక్కర్లేదు. అక్కడ పార్టీ యంత్రాంగం ఎన్నికలకు సన్నద్ధమవుతూ ఏ స్థాయి నాయకులు ఆ స్థాయిలో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అలాగే పలమనేరులో మాజీ మంత్రి అమరనాథరెడ్డి అభ్యర్థిత్వంపైనా ఎవరికీ అనుమానాల్లేవు. పుంగనూరులో చల్లా రామచంద్రారెడ్డి, పీలేరులో నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిలను గెలిపించాలని ఇదివరకే అధినేత, యువనేత ఇద్దరూ పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. పూతలపట్టులో మురళీమోహన్, జీడీనెల్లూరులో డాక్టర్ థామస్ ఇంచార్జులుగా వున్నారు. నగరిలో గాలి భానుప్రకాష్, చంద్రగిరిలో పులివర్తి నాని, శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్ అభ్యర్థిత్వాలపైనా సందేహాలకు తావు లేదు. వీరి గెలుపుకోసం యువనేత లోకేశ్ యువగళం పాదయాత్రలో పిలుపిచ్చారు. గూడూరులో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, వెంకటగిరిలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అభ్యర్థిత్వాలు కూడా ఖరారైనట్టే. ఏవైనా అనూహ్య పరిణామాలు తలెత్తితే తప్ప ఈ నియోజకవర్గాల్లో మార్పుచేర్పులకు అవకాశం లేదు. ఈ 11 చోట్ల అభ్యర్థులను అధికారికంగా ప్రకటించడమే మిగిలివుంది. దీనికి తగ్గట్టు ఈ నియోజకవర్గాల్లో దాదాపుగా ఎన్నికల ప్రచారం మొదలైపోయింది. ఇంచార్జులుగా గ్రామాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. పార్టీ కార్యాలయాలు ప్రారంభించడం, వైసీపీలో అసంతృప్తితో వున్న నాయకులు, కార్యకర్తలను పార్టీలో చేర్చుకోవడం వంటి పనుల్లో బిజీగా వున్నారు.

తంబళ్లపల్లి, సత్యవేడు, సూళ్ళూరుపేటల్లో అభ్యర్థుల ఎంపికపై ప్రధాన దృష్టి

చిత్తూరు, మదనపల్లె, తంబళ్ళపల్లె,తిరుపతి, సత్యవేడు, సూళ్ళూరుపేట నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక ఇంకా పెండింగులో వుంది. వీటిలో తంబళ్ళపల్లె, సత్యవేడు, సూళ్ళూరుపేటలపై ప్రస్తుతానికి ప్రధానంగా దృష్టి సారించింది. తంబళ్ళపల్లెకు మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ ఇంఛార్జిగా వున్నారు. ఆయన నివాసం, వ్యాపారాలు బెంగళూరులో వున్న సంగతి తెలిసిందే. అడపాదడపా నియోజకవర్గానికి వచ్చి వెళుతున్నారని, పూర్తిస్థాయి రాజకీయాలు చేయడం లేదని అధిష్ఠానానికి ఫీడ్ బ్యాక్ వుంది. అక్కడ మంత్రి పెద్దిరెడ్డి సోదరుడు ద్వారకనాథరెడ్డిని ఓడించడానికి తీవ్రంగా శ్రమించాల్సి వుందని, దాని కోసం పూర్తి సమయం కేటాయించాలని అధినేత ఎన్నిసార్లు హెచ్చరించినా శంకర్ దానికనుగుణంగా పనిచేయడం లేదని సమాచారం. రెడ్ల ఆధిపత్యం, ప్రాబల్యం కలిగిన నియోజకవర్గం కావడంతో మాజీ ఎమ్మెల్యే ఏవీ లక్ష్మీదేవమ్మ తనయుడు, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌కుమార్ రెడ్డిని బరిలోకి దింపే ప్రయత్నాలూ జరుగుతున్నాయి. అయితే దీనిపై రెండేళ్ళుగా ప్రచారమే తప్ప ఆచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో ప్రవీణ్ రాకపై శ్రేణుల్లో నమ్మకం, ఆసక్తి కూడా సన్నగిల్లుతున్నాయి. ఈలోపు ఆర్థిక పరిపుష్టి కలిగిన ఒకరిద్దరు ఆశావహులు తెరపైకి వచ్చారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలో బీసీలకు కనీసం ఒక సీటైనా ఇవ్వాలన్న డిమాండ్ ఆ వర్గాల నుంచీ వినిపిస్తున్న నేపథ్యంలో పార్టీ ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సి వుంది. సత్యవేడు విషయానికొస్తే మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్ ఇంఛార్జిగా వున్నారు. పార్టీకి కంచుకోట వంటి ఈ నియోజకవర్గంలో స్థిరమైన నాయకత్వం మాత్రం లేదు. దీంతో ప్రతి ఎన్నికల్లోనూ అభ్యర్థి ఎంపిక ప్రహసనంగా మారుతోంది. ఇక్కడ టికెట్ కోసం ఇంఛార్జి హెలెన్ గట్టిగా పోరాడుతుండగా రేసులో గత ఎన్నికల అభ్యర్థి జేడీ రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే తలారి ఆదిత్య పేర్లు కూడా వినిపిస్తున్నాయి. టికెట్ ఎవరికనే విషయమై ఇంకా స్పష్టత రాలేదు. సూళ్ళూరుపేటలో మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం ఇంఛార్జిగా వున్నారు. మాజీ మంత్రి పరసా రత్నం, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి భర్త కృష్ణయ్య తదితరుల పేర్లు కూడా టికెట్ రేసులో వినిపిస్తున్నాయి. ఈ మూడు స్థానాలపైనే ఇపుడు అధిష్ఠానం ఎక్కువ ఫోకస్ పెట్టింది.వారం పదిరోజుల్లో ఈ స్థానాలపై పార్టీ ఓ నిర్ణయం తీసుకునే అవకాశముంది.

మూడు స్థానాల్లో ఎంపికపై ప్రతిష్టంభన

తిరుపతి, చిత్తూరు, మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గాల్లో బలిజ సామాజికవర్గం ఓటర్లు అధికంగా వున్నందున వీటిలో మూడూ గానీ లేదా రెండు గానీ మిత్రపక్షమైన జనసేన పార్టీ కోరుతోంది. అయితే మూడు చోట్లా వేర్వేరు కారణాలతో జనసేనకు కేటాయించే పరిస్థితులు కనిపించడం లేదు. ఉదాహరణకు తిరుపతి స్థానం తీసుకుంటే ఇక్కడ జనసేనకు బలమైన అభ్యర్థులు అందుబాటులో లేరు. టీడీపీలో మాత్రం మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఊకా విజయ్‌కుమార్ వంటివారు టికెట్ తమకేనని ధీమాగా వున్నారు. చిత్తూరులోనూ జనసేనకు తగిన అభ్యర్థులు దొరకని పరిస్థితి. అయితే డీకే ఆదికేశవులు మనవరాలు చైతన్య ఆ పార్టీ టికెట్ కోసం యత్నిస్తున్నట్లు సమాచారం.ఇక్కడ టీడీపీ టికెట్‌కు మాత్రం తీవ్ర పోటీ వుంది. రేసులో శ్రీరామనేని చంద్రప్రకాష్, గురజాల జగన్మోహన్, కటారి హేమలత తదితరుల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. మదనపల్లెలో జనసేనకు గంగారపు రామ్‌దాస్‌చౌదరి వంటి చెప్పుకోదగ్గ నాయకులు అందుబాటులో వున్నారు.అదే సమయంలో మాజీ ఎమ్మెల్యేలు దొమ్మలపాటి రమేష్,షాజహాన్ బాషా టీడీపీ టికెట్ కోసం గట్టిగా యత్నిస్తున్నారు. జనసేనకు కేటాయించే సీట్లపై ఇంకా స్పష్టత రానందున తిరుపతి, మదనపల్లె, చిత్తూరు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై ప్రతిష్టంభన నెలకొంటోంది.

ఎంపీ స్థానాలపైనా కొనసాగుతున్న సస్పెన్స్

ఈ 17 అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన తిరుపతి, చిత్తూరు, రాజంపేట ఎంపీ స్థానాల్లో కూడా టీడీపీ అభ్యర్థుల ఎంపికపై సస్పెన్స్ కొనసాగుతోంది. తిరుపతి నుంచీ ఎంపీ అభ్యర్థిగా మాజీ ఐఏఎస్ అధికారి రత్నప్రభ కుమార్తె అంగలకుర్తి నీహారికను అధిష్ఠానం దాదాపు ఖరారు చేసింది. అయితే ఈలోపు ఆ సీటును జనసేన కోరినట్లు సమాచారం. దీంతో ఇక్కడ అభ్యర్థి ఎంపిక పెండింగులో పడింది. కాకపోతే జనసేన పార్టీకి కేటాయించడానికి అభ్యర్థి ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారింది. బలమైన అభ్యర్థిని ప్రతిపాదించే పక్షంలో సీటు కేటాయించేందుకు టీడీపీ అధిష్ఠానం సుముఖంగా వున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చిత్తూరు రిజర్వుడు స్థానానికి కూడా అభ్యర్థి విషయంలో టీడీపీ ఒక అభిప్రాయానికి రాలేదు. పలువురు ప్రధాన మంత్రుల వద్ద భద్రతాధికారిగా పనిచేసిన రిటైర్డు పోలీసు అధికారి వీసీ స్వామి వంటి వారు రేసులో వున్నారు. రాజంపేట సీటు కోసం ప్రధానంగా అన్నమయ్య జిల్లా నుంచే ఆశావహులు రేసులో వున్నారు. మొత్తానికి ఈ మూడు ఎంపీ స్థానాలతో పాటు తంబళ్లపల్లె, మదనపల్లె, సత్యవేడు, సూళ్ళూరుపేట, చిత్తూరు, తిరుపతి తదితర ఆరు అసెంబ్లీ సీట్లపై వారం పదిరోజుల్లో పూర్తి స్థాయి స్పష్టత రానుంది.

భార్యపై అనుమానం

నిద్రిస్తుండగా కత్తితో దాడి చేసి పరారైన భర్త

కేవీబీపురం, ఫిబ్రవరి7: నిద్రపోతున్న భార్యపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేసిన భర్త పైశాచికత్వమిది.ఎస్‌ఐ సునీల్ కథనం మేరకు.... కేవీబీపురం మండలంలోని కస్తూరిపురం గిరిజన కాలనీలో దంపతులు చంద్రయ్య,రత్నమ్మ(32) ఎనిమిదేళ్లుగా నివసిస్తున్నారు.మూడవ భార్య అయిన రత్నమ్మపై చంద్రయ్యలో ఇటీవల అనుమానబీజం మొలకెత్తడంతో పలుమార్లు గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి రత్నమ్మ తన కుమారుడితో ఇంట్లో నిద్రిస్తుండగా చంద్రయ్య ఇంటి బయట పడుకున్నాడు. సుమారు 11గంటల సమయంలో భార్యపైన విచక్షణారహితంగా కత్తితో దాడి చేసి పరారయ్యాడు. గాయపడిన రత్నమ్మను 108 అంబులెన్సులో పోలీసులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. రత్నమ్మ పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు.



గాయపడ్డ రత్నమ్మ అంబులెన్సులో ఆస్పత్రికి తరలింపు

సింగిల్ బెడ్‌రూం ఇంట్లో 32 ఓట్లు!

తొలగించమని ఇంకెన్నిసార్లు చెప్పాలన్న టీడీపీ నేతలు

తిరుపతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం అబ్బన్న కాలనీలో 18-39-ఎస్4-407 డోరు నెంబరుగల సింగిల్ బెడ్‌రూం ఇంటిలో 32 మంది ఓటర్లు ఇంకా కొనసాగుతుండడం చూసి టీడీపీ నేతలు మండిపడ్డారు. టీడీపీ బీఎల్‌ఏ ఇచ్చిన సమాచారం మేరకు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ ఛైర్మన్ నరసింహ యాదవ్ ఇతర టీడీపీ నేతలు బుధవారం సదరు డోర్ నెంబరు కలిగిన ఇంటికి వెళ్లి పరిశీలించారు. అధికార పార్టీకి చెందిన కార్యకర్త ఇల్లుగా గుర్తించారు. ఇంత చిన్న ఇంటిలో 32 ఓట్లు ఎలా వచ్చాయని ఆ కార్యకర్తను ప్రశ్నించగా గతంలో ఇక్కడ ఉండేవారని, ఇప్పుడు మంగళం తదితర ప్రాంతాల్లో ఉన్నారని, ఎన్నికల సమయంలో వచ్చి ఓట్లు వేసి పోతుంటారంటూ అతను నిర్భయంగా చెప్పిన సమాధానానికి విస్మయానికి గురయ్యారు. నగరపాలక సంస్థ ఎన్నికల సమయంలోనే దొంగ ఓట్లు చేర్చినట్టుగా అంచనాకొచ్చారు.ప్రస్తుతం ఆ ఇంట్లో వున్న ఇద్దరి ఓట్లను మాత్రమే వుంచి మిగిలిన ఓట్లను తొలగించాలని డిమాండు చేశారు. తిరుపతిలో దొంగ ఓట్లపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు.టీడీపీ నాయకులు ఆర్సీ మునికృష్ణ, మునిశేఖర్ రాయల్, మహేష్ యాదవ్, బ్యాంకు శాంతమ్మ, రాజేంద్ర ప్రసాద్, యువరాజు తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్లకు ఎన్నికల పాఠాలు

●శ్రీకాళహస్తిలో రహస్య సమావేశం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7: వలంటీర్లను పూర్తిస్థాయి వైసీపీ రాజకీయ కార్యకర్తలుగా ఎన్నికల్లో వినియోగించుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. శ్రీకాళహస్తిలో బుధవారం వలంటీర్లను సమావేశపరచి రాజకీయ పాఠాలు బోధించారు.ఎఫ్ఓఏ (ఫీల్డ్ ఆపరేటింగ్ ఏజన్సీ) సమావేశం ఉందంటూ శ్రీకాళహస్తి పట్టణంలోని 9 సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు సమాచారం అందింది. ప్రభుత్వ పథకాల అమలు, ప్రచారం గురించి శిక్షణ ఇచ్చే ఎఫ్ఓఏ సమావేశాలు సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాల్లోనే జరుగుతుంటాయి.ఈ సమావేశం మాత్రం పట్టణంలోని పంచాయతీ రాజ్ అతిథిగృహంలో నిర్వహించారు. పట్టణంలోని 22 సచివాలయాల్లో సినిమా వీధి 1, సినిమా వీధి 2, సినిమా వీధి 3, దోబీ ఘాట్, పెద్ద మసీదు వీధి, ఎంఎం వాడ 1, ఎంఎం వాడ 2, తెలుగు గంగ కాలనీ, జయరాం రావు వీధి సచివాలయాల పరిధిలోని వలంటీర్లను మాత్రమే తొలివిడత సమావేశానికి పిలిచారు. రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలను పాఠాలుగా వీరికి బోధించారు. వలంటీర్ల వద్ద ఇప్పటికే ఉన్న పౌర, ఓటర్ల సమాచారాన్ని ఎలా ఉపయోగించుకోవాలో సూచించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఎలా అనుకూలంగా మార్చుకోవాలి, బయట ప్రాంతాల్లో నివసించే స్థానిక ఓటర్లు ఎవరు, పోలింగ్ సమయంలో వారిని ఎలా తీసుకురావాలి, పక్కాగా వైసీపీ వ్యతిరేక ఓటర్లు ఎవరో గుర్తించి జాబితాలు సిద్ధం చేయడం వంటి పనులను వారికి వివరించారు. సమాచారం తెలిసి మీడియా ప్రతినిధులు వెళ్లగానే కొందరు వలంటీర్లు ఫొటోల్లో కనిపించకుండా ముఖం పక్కకి తిప్పేశారు. ఇది సాధారణ ఎఫ్ఓఏ సమావేశం మాత్రమే అని నిర్వాహకులు వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు.



ఎఫ్ఓఏ సమావేశంలో వలంటీర్లు

డీఎస్సీలో వచ్చేది 337పోస్టులే

తిరుపతి(విద్య),ఫిబ్రవరి 7 : వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచీ ఎదురుచూసీచూసీ కళ్లుకాయలు గాచిన నిరుద్యోగులను ప్రభుత్వం బుధవారం వెలువరించిన డీఎస్సీ నోటిఫికేషన్‌లోని వేకన్సీ పోస్టులు తీవ్రంగా నిరాశపరిచాయి.ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి మొత్తం 337పోస్టులనే చూపారు.ఎస్టీటీలో 101, ఎస్ఏలో 97, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ)లో 139 చొప్పున మొత్తం 337పోస్టులు మాత్రమే ఉన్నాయి. వీటిలో ఎస్ఏ, టీజీటీలో కలిపి 236 వేకెన్సీలు ఉండడం గమనార్హం.

గ్రావెల్ తవ్వకాలకు హైకోర్టు బ్రేక్

● ఆరు టిప్పర్లను సీజ్ చేసిన మైనింగ్ అధికారులు

పెళ్లకూరు, ఫిబ్రవరి 7: పెళ్లకూరు మండలంలోని శిరసనంబేడు, రోసనూరు గ్రామాల నుంచి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ తవ్వకాలకు బ్రేక్ పడింది. అధికార పార్టీకి చెందిన నేతలు ఇష్టారీతిగా గ్రావెల్ తవ్వి తరలిస్తుండడంపై రోసనూరుకు చెందిన ఎం.సుబ్రమణ్యం, వి.పరంధామరెడ్డి, కె.రంగారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తవ్వకాలపై హైకోర్టు స్టే విధించడంతో బుధవారం మైనింగ్ అధికారులు దాడులు నిర్వహించారు. నిజానికి వైసీపీ నాయకులు ఇప్పటికే కోట్లాది రూపాయల గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకున్నారు. అయితే స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం, హైకోర్టు నుంచి ఉత్తర్వులు రావడంతో మైనింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. బుధవారం గ్రావెల్ తరలిస్తున్న ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి ఆరు టిప్పర్లను సీజ్ చేసి పెళ్లకూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై ఎస్‌ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ పట్టుబడిన టిప్పర్లకు జరిమానా విధించామన్నారు. ఇకపై గ్రావెల్ అక్రమ తరలింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ విశ్వనాథ నాయక్

భాకరాపేట, ఫిబ్రవరి 7: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ ప్రిన్సిపాల్ విశ్వనాథ నాయక్ అన్నారు. బుధవారం ఇంటర్ సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధన కోసం నిరంతరం శ్రమించాలన్నారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాలపై పట్టు సాధించాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకురాలు నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలపై ఏనుగుల దాడులు



ఏనుగులు ధ్వంసం చేసిన వరి పైరు

భాకరాపేట, ఫిబ్రవరి 7: పంట పొలాలపై ఏనుగులు దాడి చేసి ధ్వంసం చేశాయి. చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారిపల్లె పంచాయతీ పాళెంకు చెందిన దినేశ్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, అప్పస్వామి రెడ్డి, చంద్రారెడ్డికి చెందిన వరి పైరును మంగళవారం రాత్రి పూర్తిగా తొక్కేసి ధ్వంసం చేశాయి. పాళెం రెడ్డిచెరువు కింద సాగు చేసిన పైరు చిరుపొట్ట దశలో ఉంది. ఏనుగులు వరి పైరు ధ్వంసం చేయడంతో పూర్తిగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

వృద్ధాశ్రమానికి దుస్తుల వితరణ



భాకరాపేట, ఫిబ్రవరి 7: చిన్నగొట్టిగల్లులోని 'రాస్' వృద్ధాశ్రమంలోని వృద్ధులకు హనీ ఫ్రెండ్స్ అసోసియేషన్(పుత్తూరు)కు చెందిన మహిళలు బుధవారం బట్టలు వితరణగా అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ లక్ష్మీపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రీ మృతి



ప్రమాద దృశ్యం, మృతిచెందిన తాపీ మేస్త్రీ బాబు

పాకాల, ఫిబ్రవరి 7: నేండ్రగుంట సమీపం ఉప్పువంక వద్ద బుధవారం సాయంత్రం మోటారుసైకిల్‌ను కారు ఢీకొన్న ఘటనలో మోటరుసైకిల్‌పై ప్రయాణిస్తున్న పులివర్తివారిపల్లెకు చెందిన తాపీమేస్త్రీ బాబు (45) అక్కడికక్కడే మృతిచెందాడు. పాకాల వైపు నుంచి నేండ్రగుంట వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొంది. పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



జ్యోతిప్రసాద్ (ఫైల్ ఫొటో)

పాకాల, ఫిబ్రవరి 7: దామలచెరువు పంచాయతీ కేశవనగర్‌లో గత నెల 31వ తేది బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి నిప్పుపెట్టిన ఘటనలో గాయపడిన జ్యోతిప్రసాద్ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ ప్రమాదంలో గాయపడిన ఆయన భార్య పార్వతి, సమీప బంధువు మహేష్ చికిత్స పొందుతూ ఇటీవల మృతిచెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

టైరు పంక్చరై స్కూటర్‌ని ఢీకొన్న కారు

చంద్రగిరి,ఫిబ్రవరి7: చంద్రగిరి కోట సమీపంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో కారు టైరు పంక్చరై అదుపు తప్పి ఎదురుగా వస్తున్న స్కూటరును ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు ... తమిళనాడు రాష్ట్రంలోని పేర్నంబట్టుకు చెందిన రాజు తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తుండగా చంద్రగిరి కోట సమీపంలో కారు టైరు పంక్చరైంది. దీంతో కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న స్కూటర్‌ని ఢీకొంది. ఈప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలయ్యాయి. స్కూటరిస్టును 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. స్కూటరిస్టు రేణిగుంటకు చెందిన వ్యక్తిగా తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎ.రంగంపేటలో 'గడప గడపకు'

చంద్రగిరి, ఫిబ్రవరి 7: ఎ.రంగంపేట పంచాయతీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ ఔరంగజేబు, సర్పంచ్ ఎర్రయ్య, ఎంపీటీసీ బోస్ చంద్రారెడ్డి, వైసీపీ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎడిఫై విద్యార్థికి అభినందనలు



మాస్టర్ శ్రీశాంత్‌ను అభినందిస్తున్న ఎడిఫై పాఠశాల డైరెక్టర్ ప్రణీత్ తదితరులు

తిరుచానూరు, ఫిబ్రవరి 7: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో బెస్ట్ క్యాడెట్ (జెడీ) ఆర్మీవింగ్‌గా బంగారు పతకాన్ని సాధించిన ఎడిఫై పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మాస్టర్ శ్రీశాంత్‌ను పలువురు అభినందించారు. జనవరి 27న ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతులమీదుగా సన్మానం అందుకున్న శ్రీశాంత్‌ను బుధవారం ఎడిఫై పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ ఘనత సాధించినందుకు శ్రీశాంత్‌ను పాఠశాల డైరెక్టర్ పి.ప్రణీత్ అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి గ్రూప్ కమాండింగ్ ఆఫీసర్ యుగేష్ డింగర్‌కోటే, 29(ఏ) బీఎన్ కమాండింగ్ ఆఫీసర్ మునీష్ ఆస్తాన, విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతికి సంతాపం



సురేష్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న పులివర్తి వినీల్

తిరుచానూరు, ఫిబ్రవరి 7: తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టు పంచాయతీ పాతూరు గ్రామానికి చెందిన సురేష్(19) ఈతకు వెళ్లి మృతిచెందాడు. స్థానిక టీడీపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ యువనేత పులివర్తి వినీల్ అక్కడికి చేరుకుని సురేష్ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.



ముద్దుకృష్ణమకు నివాళులు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 7: మాజీ మంత్రి,టీడీపీ సీనియర్ నాయకుడు గాలి ముద్దుకృష్ణమ నాయుడు ఆరవ వర్ధంతిని టీడీపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. రామచంద్రాపురం మండలం వెంకటరామాపురంలోని ముద్దుకృష్ణమ సమాధి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులు అర్పించారు.టీడీపీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్, జిల్లా అధికార ప్రతినిధి చిన్నబాబు, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, సుబ్రహ్మణ్య యాదవ్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



వేటూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న పీసీ వేంకటేశ్వర్లు

ఓఆర్ఐకి వేటూరి సేవలు చిరస్మరణీయం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 7: 1940-50 మధ్య కాలంలో ప్రాశ్చ్య పరిశోధనా సంస్థ (ఓఆర్ఐ)కు వేటూరి ప్రభాకరశాస్త్రి చేసిన సేవలు చిరస్మరణీయమని ఓఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ పీసీ వేంకటేశ్వర్లు పేర్కొన్నారు. వేటూరి 137వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. పీసీ వేంకటేశ్వర్లు మాట్లాడుతూ తొలి తెలుగు పదం నాగబును అమరావతి శాసనంలో గుర్తించిన శాసన శోధకుడు వేటూరి అని కొనియాడారు. ఓఆర్ఐలో రీడర్‌గా వేటూరి సేవలందించారని గుర్తు చేసుకున్నారు. ఆ కాలంలోనే అన్నమయ్య వంశీకుల సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చారని కొనియాడారు.తొలి తెలుగు కవయిత్రి తాళ్లపాక తిమ్మక్క సుభద్రా కల్యాణాన్ని ప్రచురించారని అన్నారు. దళితుల దేవాలయ ప్రవేశానికి నడుం బిగించారని చెప్పారు. ఆర్ట్స్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ కిరణ్‌క్రాంత్‌చౌదరి మాట్లాడుతూ తిరుమల మ్యూజియం ఏర్పాటులో వేటూరి ప్రభాకరశాస్త్రి కృషిని గుర్తు చేసుకున్నారు.



వాహన మండపం వద్ద వేస్తున్న ముగ్గులు - గ్యాలరీల్లో ఏర్పాటు చేస్తున్న చలువ పందిళ్లు

రథసప్తమి ఏర్పాట్లు ప్రారంభం

తిరుమల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో రథసప్తమి ఏర్పాట్లు మొదలయ్యాయి. ఈనెల 16వ తేదీన సూర్య జయంతి సందర్భంగా తిరుమలలో వేంకటేశ్వర స్వామి ఉదయం నుంచి రాత్రి వరకు ఏడు వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం సూర్యప్రభ వాహనంతో ఉత్సవాలు ప్రారంభమై చిన్నశేషవాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, చంద్రప్రభ వాహనాలు జరుగుతాయి. తిరుమలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. వాహన మండపాన్ని రంగు ముగ్గులతో సౌందర్యవంతంగా తీర్చిదిద్దుతున్నారు. భక్తులు వేచి ఉండే గ్యాలరీలపై చలువ పందిళ్లు వేస్తున్నారు. విద్యుత్ అలంకరణ పనులు మొదలయ్యాయి. గ్యాలరీల్లో తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి కొళాయిలను సిద్ధం చేస్తున్నారు.

ఎన్నికల వేళ పారదర్శకంగా పనిచేయండి

కమిషనర్ కలిసిన టీడీపీ నేతలు



తిరుపతి, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పారదర్శకంగా వ్యవహరించాలని ఓటరు నమోదు అధికారిగా ఉన్న మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్‌ను టీడీపీ నేతలు కోరారు. కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆమెను టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. తిరుపతిలో ఎన్నికలంటేనే అధికారులు భయపడే పరిస్థితి ఉందని, ఉప ఎన్నికల్లో పారదర్శకత పాటించని వారిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకున్న విషయంపై ప్రస్తావించారు. దొంగ ఓట్లపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో నాయకులు బీఎల్ సంజయ్, బుల్లెట్ రమణ, మహేష్ యాదవ్, కంకణాల రజనీకాంత్, మునిశేఖర్ రాయల్, బ్యాంకు శాంతమ్మ, కొట్టే హేమంత్ రాయల్, ఆర్సీ శ్రీనివాస్, విశ్వనాథం, రఘు తదితరులు పాల్గొన్నారు.

సాయుధ విభాగం అధికారులకు వీడ్కోలు

● ఇటీవల బదిలీ అయిన 9మంది తిరుపతి ఏఆర్ అధికారులు



బదిలీ అయిన ఏఆర్ అధికారులతో ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 7: ఇటీవల బదిలీ అయిన తిరుపతి సాయుధ విభాగం (ఏఆర్) ఏఎస్పీ లక్ష్మీనారాయణరెడ్డితో పాటు మరో ఎనిమిది మంది ఏఆర్ అధికారులకు ఘనంగా వీడ్కోలు పలికారు. న్యూబాలాజీ కాలనీలోని ఏఆర్ కార్యాలయంలో బుధవారం జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో వారిని ఎస్పీ పరమేశ్వరరెడ్డి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి సాయుధ పోలీసు విభాగం అధికారులు, సిబ్బంది వెలకట్టలేని సేవలను అందించారని కొనియాడారు. క్రమశిక్షణ, పట్టుదల కలిగిన ఏఆర్ ఏఎస్పీ లక్ష్మీనారాయణ లాంటి అధికారి జిల్లా నుంచి బదిలీ కావడం బాధాకరమన్నారు. బదిలీ అయిన డీఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఐలు శ్రీనివాసులు, చంద్రశేఖర్, నాగభూషణం, చలపతి, ఆర్ఎస్ఐలు చలపతి, నదియా, ఇమామ్ ఖాసింలను పేరుపేరునా ప్రస్తావిస్తూ వీడ్కోలు పలికారు. జిల్లా అదనపు ఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, సెబ్ ఏఎస్పీ రాజేంద్ర, ఏఆర్ అడ్మిన్ డీఎస్పీ రవీంద్రారెడ్డి, హోంగార్డ్స్ డీఎస్పీ చిరంజీవి, ఏంటీఓ రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సిద్ధం' సభకు స్కూల్ బస్సులు పంపాల్సిందే!

లేకపోతే చర్యలు తప్పవని అధికారుల హెచ్చరిక

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 7: 'సిద్ధం' సభకు ప్రైవేటు పాఠశాలల బస్సులు పంపాలని, లేకపోతే ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని రవాణాశాఖ అధికారులు హెచ్చరించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. బుధవారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో రవాణాశాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈనెల 11న అనంతపురంలో సీఎం జగన్ నిర్వహించనున్న సిద్ధం సభకు జిల్లా నుంచి భారీసంఖ్యలో జనసమీకరణ చేయడానికి ప్రైవేటు పాఠశాలల బస్సులను పంపాలని ఆదేశించారు. అంత దూరానికి పాఠశాల బస్సులను పంపలేమని కొందరు సమాధానమిచ్చా రు. హైకోర్టు ఆదేశాల ప్రకారం పాఠశాల బస్సులను రాజకీయ పార్టీల సమావేశాలకు పంపకూడదనే అంశాన్నీ ప్రస్తావించారు. అయినా, బస్సులను పంపాల్సిందేనని, పాఠశాలలో ఎన్ని బస్సులున్నాయో అన్నిటినీ తప్పనిసరిగా పంపాలని అధికారులు చెప్పారు. లేనిపక్షంలో విద్యాశాఖ, రవాణాశాఖ అధికారులు పాఠశాలల తనిఖీలకు వస్తారని హెచ్చరించారు.తమ సొంత వివాహాలకు, శుభకార్యాలకు పాఠశాల బస్సులను వినియోగించుకుంటే అపరాధ రుసుం రాసే రవాణాశాఖ అధికారులు..అనంతపురంలో జరిగే రాజకీయ సమావేశానికి బ స్సులను పంపాలని బెదిరించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. శనివారం సాయంత్రంలోపు పాఠశాలల బస్సులను రవాణాశాఖ అధికారులకు అప్పగించాలని హుకుం జారీ చేయడంతో ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ప్రైవేటు స్కూ ళ్ల యాజమానులు ఉన్నారు.

ఏదో అనుకుంటే.. ఇంకేదో అయిందే..!

● కుప్పానికి హంద్రీ నీవా జలాలపై వైసీపీలో అంతర్మథనం ● టీడీపీ ప్రశ్నలకు సమాధానం చెప్పలేని వైనం

రామకుప్పం, ఫిబ్రవరి 7: 'కుప్పానికి హంద్రీ-నీవా నీళ్లు తెచ్చేశాం. అన్ని చెరువులు నింపేస్తాం' అంటూ సభలు, సోషల్ మీడియాలో వైసీపీ నేతలు ఊదరగొట్టారు. నాలుగున్నరేళ్లుగా కాలువ పనులను గాలికి వదిలేసి.. ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో నీళ్లు ఇచ్చేశామని చెప్పుకోవడానికి తాపత్రయపడ్డారు. అరకొర పనులతో నీటిని తీసుకొచ్చి.. రాజకీయ ప్రయోజనం పొందాలని భావించారు. వైసీపీ నేతలు ఇలా అనుకుంటే.. అది మరోలా అయింది.

వైసీపీ అధికారంలోకి రాగానే కుప్పం నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించింది. 2018లో సీఎంగా చంద్రబాబు వివిధ అభివృద్ధి పనుల కోసం మంజూరు చేసిన రూ.1400కోట్లను నిలుపుదల చేసింది. నియోజకవర్గానికి హంద్రీ నీవా నీటిని తీసుకొచ్చేందుకు టీడీపీ హయాంలో 80 శాతానికిపైగా కాలువ పనులు జరిగాయి. వైసీపీ ప్రభుత్వం మిగిలిన పనులను పూర్తి చేయలేదు. ఈ క్రమంలో ఏడాదిన్నర కిందట కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం జగన్ ఆరు నెలల్లో హంద్రీ నీవా నీటిని తీసుకొస్తామని ప్రకటించారు. ఆ తర్వాత కూడా పనులు చేపట్టలేదు. ఎన్నికల వేళ చంద్రబాబు నియోజకవర్గానికి తాము నీటిని ఇచ్చామని చెప్పుకొనేందుకు రెండు, మూడు నెలలుగా ఆగమేఘాల మీద కాలువ పనులు చేపట్టారు. అరకొర పనులు చేసి గత నెల 14న వి.కోట మండలం ఆదినపల్లె లిఫ్ట్ పాయింట్ నుంచి కుప్పం వైపు పంపింగ్ ప్రారంభించారు. రామకుప్పం మండలం వర్థికుప్పం సమీపానికి ఈ నీళ్లు చేరగానే.. అక్కడ సభ నిర్వహించారు. సీఎం జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, త్వరలో ఆయనే కుప్పానికి వచ్చి ఈ విషయం చెబుతారన్నారు. అప్పట్నుంచి జలాలు రామకుప్పం మండలాన్ని దాటి ముందుకు సాగలేదు. ఆదినపల్లె నుంచి లిఫ్టుల ద్వారా జలాలు ఆగి, ఆగి వస్తుండటంతో వర్థికుప్పానికి వచ్చేసరికే ఇంకిపోయి, కాలువల్లో తక్కువ నీళ్లు కనిపిస్తున్నాయి. దీంతో వైసీపీ నేతలు, శ్రేణులు అంతర్మథనంలో పడ్డారు. ఈ పరిణామాల నేపథ్యంలో 5న జరగాల్సిన సీఎం జగన్ పర్యటన రద్దయింది.

ఈ ప్రశ్నలకు జవాబులేవీ?

కుప్పానికి హంద్రీ-నీవా జలాలు తీసుకురావడంపై సోషల్ మీడియా వేదికగా టీడీపీ ప్రశ్నల పరంపర సంధిస్తోంది. అసలు వర్థికుప్పానికి చేరిన జలాలు ఎక్కడినుంచి వచ్చాయని టీడీపీ శ్రేణులు ప్రశ్నించాయి. కాలువల ద్వారా జలాలతో చెరువులను నింపడం చూశామని, ప్రస్తుతం కుప్పానికి జలాలు వచ్చిన తీరును చూస్తే చెరువల నుంచి జలాలను కాలువలోకి పంపినట్లు కనిపిస్తోందని ఎద్దేవా చేశాయి. కృష్ణా నదిలో జలాలు లేని పరిస్థితిలో కుప్పం వరకు నీళ్లు ఎలా వచ్చాయని కూడా టీడీపీ శ్రేణులు ప్రస్తావించాయి. పుంగనూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులోని జలాలను హంద్రీ-నీవా కాలువకు మళ్లించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశాయి. సాధారణంగా సోషల్ మీడియాలో టీడీపీ శ్రేణుల పోస్టులపై అంతెత్తున స్పందించే వైసీపీ శ్రేణులు.. ఈ విషయంలో ఏమీ చెప్పలేని పరిస్థితిలో పడ్డాయి.



వర్థికుప్పం వద్ద కాలువలో నీళ్లు కనిపించేలా అడ్డుకట్ట వేశారిలా..



జగనన్న పాలనలో సంక్షేమం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 7: జగనన్న పాలనలోనే అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని వైసీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. రామచంద్రాపురం మండలంలోని కేకేవీపురం, సొరకాయలపాళెం, నెన్నూరు,నడవలూరు, శ్రీరామపురం పంచాయతీల్లో జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బ్రహ్మానందరరెడ్డి, జడ్పీటీసీ డిల్లీరాణి, మాజీ ఎంపీపీ దామోదర రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు బాబుయాదవ్, భాస్కర్‌రెడ్డి, యోగానందరెడ్డి, గిరిధర్‌రెడ్డి, మురగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉదయం బాధ్యతలు స్వీకరించి సాయంత్రం రిలీవైపోయిన పుత్తూరు తహసీల్దార్



శ్రీనివాసగౌడ్

పుత్తూరు, ఫిబ్రవరి 7: పుత్తూరు తహసీల్దారుగా శ్రీనివాసగౌడ్ బుధవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. కర్నూల్ జిల్లా డోన్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన ఎన్నికల నేపథ్యంలో రాత్రీ పగలు బాధ్యతలు ఎక్కువగా వుంటాయని భావించి ఇక్కడే నివాసం ఉండేందుకు అద్దె ఇల్లు కూడా చూసుకున్నారు. అయితే మధ్యాహ్నానికే అన్నమయ్య జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు రావడంతో అవాక్కయ్యారు. చేసేది ఏమీ లేక ఉన్నతాధికారుల ఆదేశం మేరకు రిలీవ్ అయ్యారు.

ఓటర్ల జాబితాలో తప్పుల సవరణకు చర్యలు



విద్యార్థులతో కలిసి భోంచేస్తున్న కలెక్టర్

చిల్లకూరు, ఫిబ్రవరి 7: ఓటర్ల జాబితాలలో తప్పులను సవరించేందుకు చర్యలు తీసుకోవాలని మండల అధికారులను కలెక్టర్ లక్ష్మీశా ఆదేశించారు. బుధవారం చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలోని 114, 115 పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో త్వరితగతిన వసతులను మెరుగుపరచాలని సూచించారు. అనంతరం పాఠశాలలో వసతులు, బోధనా విధానాలు, మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సామర్థ్యాలతో కూడిన బోధనను అదించాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని కోరారు. అంతకుముందు చింతవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రిజిస్ట్రర్లను, వార్డును పరిశీలించారు. ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మధ్యాహ్నం తరువాత స్థానిక మండల కార్యాలయ ఆవరణలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొని అర్జీలను స్వీకరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్‌కుమార్, డీఈవో శేఖర్, డీఎంహెచ్‌వో శ్రీహరి, డిప్యూటీ ఈవో శివప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చిందేపల్లి చెరువు కట్టకు ముప్పు !



మట్టి తవ్వడంతో చెరువు కట్టకు ఆనుకుని ఏర్పడిన గుంతలు

ఏర్పేడు, ఫిబ్రవరి 7: మండలంలోని చిందేపల్లి చెరువు కట్టకు ముప్పు ఏర్పడింది.చిందేపల్లి వద్ద హౌసింగ్ కాలనీ ఏర్పాటుకు ప్రభుత్వం 400 ఎకరాలను తీసుకుంది. అయితే ఆ గ్రామానికి చెందిన చెరువు కట్టకు ఆనుకుని ఉన్న సుమారు ఐదెకరాల ప్రభుత్వ భూమిలో జాతీయ రహదారి పనులు చేస్తున్న మెగా కంపెనీ యాజమాన్యం మట్టిని తవ్వి తరలిస్తోంది.ఐదెకరాల్లో సుమారు 20మీటర్ల లోతు వరకు మట్టిని తవ్వేశారు. వర్షాకాలంలో చెరువు కట్టను సంరక్షించడానికి కలుజు తూములు వేసేందుకు రైతులు వెళ్లడానికి అవకాశం లేకుండా మట్టి కోసం తవ్విన గుంతలు నిండిపోనున్నాయి.మండలానికి కూతవేటు దూరంలో మట్టి, గ్రావెల్ తరలిపోతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోలేదని చిందేపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కట్టను సంరక్షించకపోతే ఈ సారి వర్షాకాలానికి చిందేపల్లి చెరువు ఉంటుందో కొట్టుకుపోతుందో కూడా తెలియదని రైతులు అంటున్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి ఈ మట్టి దోపిడీ అరికట్టాలని చిందేపల్లి రైతులు వేడుకుంటున్నారు.

స్పీడ్ స్కేటింగ్‌లో తిరుపతి క్రీడాకారుల ప్రతిభ


స్కేటింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా క్రీడాధికారి సయ్యద్

తిరుపతి (కొర్లగుంట), ఫిబ్రవరి 7: తమిళనాడు కోయంబత్తూరులో గత వారం జరిగిన స్పీడ్ స్కేటింగ్ పోటీలలో తిరుపతికి చెందిన క్రీడాకారులు ప్రతిభచాటారు. 18రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొనగా తొలిస్థానం తమిళనాడు, రెండో స్థానం ఆంధ్రాకు లభించింది. తిరుపతి జిల్లా నుంచి 20మంది క్రీడాకారులు హాజరుకాగా 9మంది మెడల్స్ సాధించారు. అండర్ -16బాలికల విభాగంలో నిఖిల(ఒక రజితం, రెండు కాంస్య) అండర్-12 విభాగంలో లికిత(స్వర్ణం), అండర్-6 విభాగంలో పూజశ్రీ(రజితం), అండర్ 12 బాలుర విభాగంలో దైవిక్, జశ్వంత్(కాంస్యం), రోషన్‌యాదవ్ (రజితం, కాంస్యం), ఇదీష్ రెడ్డి(రజితం, కాంస్యం), అండర్ -14విభాగంలో చరణ్‌సాయి(రజితం), అండర్-6 విభాగంలో తరుణ్(కాంస్యం) సాధించారు. ఓవరాల్‌గా రెండో స్థానం కైవసం చేసుకోవడంతో కప్ బహుమతిగా అందజేశారు. బుధవారం జిల్లా క్రీడాకాధికారి సయ్యద్‌సాహెబ్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా స్కేటింగ్ కోచ్ వి.జి.ప్రేమ్‌నాథ్, అసిస్టెంట్ కోచ్‌లు కావ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 64,345 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,788 మంది తలనీలాలు సమర్పించారు.

11న అనంతాళ్వారు అవతారోత్సవం

తిరుమల, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): శ్రీవైష్ణవ భక్తుడు, ఆళ్వారుల్లో ప్రముఖుడైన అనంతాళ్వారు 970వ అవతారోత్సవం ఈ నెల 11వ తేదీన తిరుమలలో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి పురుశైవారి తోటలో టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అనంతాళ్వారు బోధనలు, రచనలపై సదస్సు నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటలకు మొదలయ్యే ఈ కార్యక్రమంలో 16 మంది పండితులు ఉపన్యసించనున్నారు.

ఖాళీ టిన్ల విక్రయానికి 20న సీల్డ్ టెండర్ల ఆహ్వానం

తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ టిన్‌లు రేటు కాంట్రాక్ట్ కింద సీల్డ్ టెండర్లను టీటీడీ ఆహ్వానిస్తోంది. తిరుపతిలోని హరేకృష్ణ రోడ్డులో ఉన్న మార్కెటింగ్ (వేలం) కార్యాలయంలో సీల్డ్ టెండర్లు ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు అందజేయాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు 0877-2264429లో సంప్రదించాలని టీటీడీ కోరింది.

ప్రభుత్వోద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేశారు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 7: ప్రభుత్వోద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేశారని పాదిరికుప్పం, మర్రిపల్లి గ్రామాలకు చెందిన సోమశేఖర్, పరంధామన్ ఆరోపిస్తున్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ మంత్రి నారాయణస్వామి మాజీ పీఏ రమేష్ తండ్రి దొరస్వామి ప్రభుత్వోద్యోగాలు ఇప్పిస్తామని తమ వద్ద డబ్బు తీసుకున్నాడని తెలిపారు. ఉద్యోగం ఇవ్వకపోగా డబ్బు తిరిగి అడిగితే బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకుపోవడంతో డబ్బు కొంతవరకు తిరిగి ఇచ్చారని, మిగిలింది అడిగితే ఇంట్లో మహిళలతో బూతులు తిట్టిస్తున్నారని అన్నారు. న్యాయం చేయాలని కోరారు. మహేష్, గుర్రప్ప పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో సగం మాదిగలకు ఇవ్వాలి

● మాదిగ ఐక్యవేదిక


సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ ఐక్యవేదిక నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 7: రాష్ట్రంలో ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో సగం సీట్లు మాదిగలకు ఇవ్వాలని, తిరుపతి ఎంపీ స్థానా న్ని మాదిగలకు కేటాయించాలని మాదిగ ఐక్యవేదిక డిమాండ్ చేసిం ది. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఐక్యవేదిక నాయకులు సుధాకర్‌బాబు, సుబ్బయ్య, గోపి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు రెండు కళ్లు అని చెప్పుకునే సీఎం జగన్ 32 ఎస్సీ రిజర్వుడు ఎమ్మెల్యే, ఎంపీ స్థానాల్లో సగం మాదిగలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గూడూరు, సూళ్లూరుపేట, సత్యవేడు, తిరుపతి ఎంపీ స్థానాన్ని మాదిగలకు ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్లను ఏ పార్టీ తీరిస్తే వారికే వచ్చే ఎన్నికల్లో మద్దతు తెలియజేస్తామన్నారు. లేనిపక్షంలో తమ పల్లెల్లో ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర, చిరంజీవి, అర్జునయ్య, మునిరాజా, శంకర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నగర కమిటీ ఎన్నిక


నియామకపత్రం అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 7 : కాంగ్రెస్ పార్టీ నగర ఉపాధ్యక్షుడిగా మునవ్వర్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా జి.రమేష్‌రెడ్డి నియమితులైనట్లు నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారికి నియామక పత్రాలు అందజేసి రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

వెంకన్న సేవలో ఎల్లా వేంకటేశ్వరరావు



తిరుమల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ మృదంగ వాయిద్య కళాకారుడు ఎల్లా వేంకటేశ్వరరావు బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని, తర్వాత మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 60 ఏళ్లుగా తిరుమలకు వస్తున్నానని, ఎప్పటికప్పుడు మార్పులు జరుగుతున్నాయని అన్నారు. చిరంజీవి, వెంకయ్యనాయుడికి పద్మవిభూషణ్ పురస్కారం రావడం సంతోషకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం కళాకారులను గుర్తిస్తుంటే ఇక్కడి వారు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

బడ్జెట్‌లో ఉద్యోగులకు మొండిచేయి

ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజి



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 7: ఏపీ ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టిన ఓట్‌ఆన్ బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు మొండిచేయి చూపిందని ఏపీ ఉపాధ్యాయ సంఘ(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజి విమర్శించారు. 2023 జూలై నుంచి ఎదురుచూస్తున్న మధ్యంతర భృతి(ఐఆర్), 12వ పీఆర్సీ గురించి బడ్జెట్‌లో ప్రస్తావించకుండా ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిందని వాపోయారు. కేంద్ర ప్రభుత్వ తరహాలో 2003 డీఎస్సీ టీచర్లకు పాతపెన్షన్ అమలుకు చర్యలు చేపట్టకపోవడం బాధించిందని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే రానున్న ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సంఘ ఆధ్వర్యంలో ఇప్పటికే ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేశామని పేర్కొన్నారు.

శ్రీవారి నిధుల భద్రత బాధ్యత ఎవరిది?

బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో శ్రీవారికి సమర్పించే నిధులకు భద్రత, బాధ్యత ఎవరు వహిస్తారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి టీటీడీని సూటిగా ప్రశ్నించారు. తిరుపతి కోఆపరేటివ్ టౌన్ బ్యాంకులో ఇటీవల టీటీడీ రూ.10 కోట్లు డిపాజిట్ చేసిన విషయమై ఆయన బుధవారం ఒక ప్రకటనలో స్పందించారు. తిరుపతి టౌన్‌బ్యాంకులో రూ.10 కోట్లు స్వామి వారి డబ్బు డిపాజిట్ చేయడం వెనుకున్న అంతర్యమేమిటని నిలదీశారు. ఎన్నికల ముందు ఈ ప్లాన్ ద్వారా అధికార పార్టీ నాయకులు శ్రీవారి సొమ్ముతో రుణాలు ఇచ్చి, దీన్ని కూడా ఓటు బ్యాంకు రాజకీయాలకు ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. 2020లో ఏకంగా రూ.5 వేల కోట్లు టీటీడీ నిధులను రాష్ట్ర బాండ్లకు పెట్టుబడి పెట్టే ప్రయత్నం చేశారంటూ గుర్తు చేశారు. మొన్నటికి మొన్న టీటీడీ నిధుల్లో ఏటా ఒక శాతం నిధులను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు కేటాయిస్తూ పాలకమండలి తీర్మానం చేసిందని, ఇవాళ తిరుపతి టౌన్ బ్యాంకులో రూ.10 కోట్లు డిపాజిట్ చేశారని ఆరోపించారు. శ్రీవారి ఖజానాను ఖాళీ చేయాలని చూస్తున్నారా? అని ప్రశ్నించారు. శ్రీవారి నిధులను ఇలా దారి మళ్లించడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 0.6 శాతం అధికంగా వడ్డీ వస్తుందని డిపాజిట్ చేసినట్టు చెబుతున్నారని, వెంకటేశ్వరస్వామి వడ్డీ కాసుల వాడే కానీ వడ్డీ వ్యాపారి కాదని టీటీడీ గుర్తుంచుకోవాల్సి ఉందన్నారు. టీటీడీ నిధులను జాతీయ బ్యాంకుల్లోనే డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రైవేట్ కంపెనీగా టీటీడీ : సుగుణమ్మ


మీడియాతో మాట్లాడుతున్న సుగుణమ్మ

తిరుపతి- ఆంధ్రజ్యోతి : టీటీడీని చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ప్రైవేట్ కంపెనీలాగా మార్చేశారని టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ధ్వజమెత్తారు. 'వెంకన్న హుండీకి మరో టోకరా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం నేపథ్యంలో బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. ధార్మిక సంస్థను సొంత కంపెనీలాగా భావించి శ్రీవారి నిధులను ఇష్టారాజ్యంగా దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కువ వడ్డీ వస్తుందని ఫైనాన్స్ కంపెనీలకు కూడా ఇచ్చేటట్టు ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇదిలావుంటే టీటీడీకి 8.4శాతం వడ్డీ రేటు చెల్లించేలా బాండ్లు ఇచ్చి 7.5 వడ్డీతో సెక్యూరిటీ డిపాజిట్లు కొనుగోలు చేయడం ఏమిటో టౌన్‌బ్యాంకు పాలకమండలికే అర్థం కావాలన్నారు. తద్వారా ఏడాదికి రూ.45లక్షల వరకు బ్యాంకు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. టీటీడీ నిధులు డిపాజిట్ చేసి అటు శ్రీవారి భక్తుల్లో అయోమయానికి గురిచేయడం, ఇటు టౌన్‌బ్యాంకు నష్టపోయేలా చేసి ఖాతాదారులకు అభద్రతాభావం కల్పించడం ఎందుకని ప్రశ్నించారు. దొంగ ఓట్ల చేర్పులకు టౌన్‌బ్యాంకు నిలయంగా మారిందని మండిపడ్డారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు రామ్మూర్తి రాయల్, కంకణాల రజినీకాంత్, మునిశేఖర్ రాయల్, కరాటే చంద్ర, మునిరామయ్య, విశ్వనాథం, చంద్ర, సుధాకర్ పాల్గొన్నారు.

జోగయ్య సలహాలు ఇవ్వడం తప్పా?

ఓవీ రమణ వ్యాఖ్యలపై కాపు సంక్షేమ సంఘం ఫైర్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 7: కాపు సంక్షేమ సంఘం నేత హరిరామజోగయ్య సలహాలు ఇవ్వడం తప్పా అని కాపు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మధుబాబు ప్రశ్నించారు. జోగయ్య గురించి టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ఓవీ రమణ వ్యాఖ్యలను ఖండించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రాష్ట్ర భవిష్యత్తు కోసం కష్టపడుతుంటే ఓవీ రమణ వ్యాఖ్యలు సరికావన్నారు. కాపు జాతి ఐక్యత ఇప్పుడిప్పుడే బలపడుతుంటే హరిరామజోగయ్యను విమర్శించడం మంచి పద్ధతి కాదన్నారు. పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రి చేయాలనే ఉద్దేశంతో సలహాలు ఇవ్వడం తప్పా అన్ని ప్రశ్నించారు. బీజేపీకి ఆర్ఎస్ఎస్ ఎలాగో జనసేనకు కాపు సంక్షేమ సేన అలాగేనని గుర్తు చేశారు.కేఎస్ఎస్ నాయకులు కొండ రాజమోహన్, హిమవంత్, సురేష్ రాయల్, పవన్ కల్యాణ్, రత్నం పాల్గొన్నారు.







శ్రీవేంకటేశ్వర గోష్టిగానంతో పులకించిన సప్తగిరులు

తిరుమల, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): కల్యాణ వేదికలో 300 మంది కళాకారులు ఆలపించిన పురందరదాస కీర్తనలతో తిరుమల సప్తగిరులు పులకించాయి. పురందరదాస ఆరాధన మహోత్సవాల ప్రారంభ నేపథ్యంలో బుధవారం సాయంత్రం 'శ్రీవేంకటేశ్వర నవరత్నమాల' సంకీర్తనా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పురందరదాస కృతులను కళాకారులు ఆలపించారు. 'దాసన మాడికో ఎన్న.., ఇందు నిన్న స్మరయ.., వేంకటేశనే.., తిరుపతి వెంకటరమణ.., శోభానే శోభానే.., వంటి కీర్తనలు ఆకట్టుకున్నాయి. దాససాహిత్య ప్రాజెక్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు, ప్రముఖ సంగీతకారిణి ద్వారం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పురందరదాస ఆరాధనోత్సవాలు

కర్ణాటక సంగీత పితామహులు పురందర దాస ఆరాధనా మహోత్సవాలు తిరుమల ఆస్థాన మండపంలో గురువారంనుంచి మూడు రోజుల పాటు జరుగనున్నాయి. తొలి రోజు సుప్రభాత, ధ్యానం, సామూహిక భజన, నగరసంకీర్తన, పురందర సాహిత్య గోష్టి, పీఠాధిపతులు మంగళాశాసనాలు, సంకీర్తనమాల కార్యక్రమాలు నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు అలిపిరిలోని పురందర దాసు విగ్రహానికి పుష్పమాలను సమర్పిస్తారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవారి ఆలయం నుంచి నారాయణగిరి ఉద్యానవనంకు శ్రీవారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువెళ్లి ఊజంల్‌సేవ, దాససంకీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తారు. చివరిరోజు సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగరసంకీర్తన, హరిదాస రసరంజని కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వేటూరి ప్రభాకరశాస్త్రికి ఘన నివాళి



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 7: తాళపత్ర పరిశోధకుడు, రచయిత, పండితుడు వేటూరి ప్రభాకర శాస్త్రి 136వ జయంతిని టీటీడీ బుధవారం ఘనంగా నిర్వహించింది. ఇందులో భాగంగా ఉదయం శ్వేత భవనం వద్ద, ప్రాశ్య కళాశాలలోని ఆయన విగ్రహాలకు శ్వేత డైరెక్టర్‌భూమన్, స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వీ కుమార్, సీపీఆర్వో టి.రవి, సీఏవో శేషశైలేంద్ర, డీఈవో భాస్కరరెడ్డి, అన్నమాచార్య ప్రాజక్టు సంచాలకులు విభీషణ శర్మ పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. భూమన్ మాట్లాడుతూ శ్రీవారిపై అన్నమయ్య రచించిన సంకీర్తనలను పరిష్కరించి, అన్నమయ్య సాహిత్యం విశ్వవ్యాపితం కావడానికి వేటూరి కృషి కారణమన్నారు. ఉన్నతమైన సాహితీ విలువలను, తెలుగు సంస్కృతిని, సంప్రదాయాలను ప్రపంచానికి అందించిన ఘనత ఆయనదేనన్నారు. సాయంత్రం అన్నమాచార్య కళామందిరంలో జరిగిన సభలో టీటీడీ జేఈవో సదాభార్గవి, వి.వీరబ్రహ్మం, ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు కె.సర్వోత్తమరావు, కట్టమంచి మహాలక్ష్మి, టీటీడీ ప్రచురణల విభాగం ఉపసంపాదకులు నరసింహాచార్యులు, సాహితీప్రియులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శ్రీవారి దర్శనం

టీటీడీ జేఈవో సదాభార్గవి

ఘనంగా పద్మావతి జూనియర్ కాలేజీ వార్షికోత్సవం


మాట్లాడుతున్న జేఈవో సదాభార్గవి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 7: విద్యార్థినులకు శ్రీవారి దర్శనం కల్పించనున్నట్లు టీటీడీ జేఈవో సదాభార్గవి పేర్కొన్నారు. పద్మావతి జూనియర్ కాలేజీ వార్షికోత్సవంలో బుధవారం ఆమె పాల్గొని మాట్లాడారు. భరత ఖండం వేద భూమి అని, ఇందువల్ల ఆధ్యాత్మికతతో కూడిన విద్యనూ విలువలను నేర్చుకోవాలని కోరారు. కాలేజీలో ఉన్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విష్ణు సహస్రనామాన్ని ప్రతి రోజు చదవడం, వినడం ద్వారా పంచ భూతాలు అగుపిస్తాయన్నారు. శ్రీవారు, పద్మావతి అమ్మవారి అనుగ్రహం కలుగుతుందన్నారు. కాలేజీ ప్రాంగణంలో నిర్మించిన ధాత్రి సదన్‌ను ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ డీఈవో భాస్కరరెడ్డి, న్యాయాధికారి వీర్రాజు, సహ న్యాయాధికారి యుగంధర్ రెడ్డి, ప్రిన్సిపాల్ భువనేశ్వరీదేవి పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 7 : నాలుగేళ్ల తర్వాత ఏర్పడిన కమిటీ ఆస్పత్రి అభివృద్ధికి సహకరించాలని ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ అన్నారు. నూతనంగా నియమితులైన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. ఆస్పత్రిలో పారిశుధ్య కార్మికులతో పాటు సెక్యూరిటీ సిబ్బంది సంఖ్యను, వారి జీతాలను పెంచాలని తీర్మానించారు. అవసరమైన మందులు, వైద్య పరికరాలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో ఏవీఎస్ ప్రసాద్, లేబర్ ఆఫీసర్ రాజయ్య, ఈఎస్ఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

బీవీబీలో సైన్స్ టీచర్లకు ముగిసిన శిక్షణ


ప్రయోగాలపై శిక్షణ పొందుతున్న టీచర్లు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి7 : భారతీయ విద్యాభవన్స్ కేంద్రంగా ఐసర్, ఐఎస్‌టీఎఫ్, ఆర్ఎస్సీల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని 80మంది ఫిజికల్ సైన్స్ టీచర్లకు నిర్వహించిన ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ శిక్షణ బుధవారంతో ముగిసింది. మొదటి రోజు తరగతి గదిలో నిర్వహించే కృత్యాలలో విద్యార్థులు చురుకుగా పాల్గొనేందుకు అవసరమైన వ్యూహాలపై చర్చించగా..రెండవ రోజు తక్కువ ఖర్చుతో సూక్ష్మ ప్రయోగాల నిర్వహణ, ఆటలతో కూడిన కృత్యాలు నిర్వహించడంపై శిక్షణ సాగింది. అలాగే బోధనకు ఉపయోగపడే పలు వెబ్‌సైట్ల(ఆన్‌లైన్‌లో) వివరాలను టీచర్లకు అందించారు. జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, బీవీబీ డైరెక్టర్ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

అర్చకులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 7: ఆలయాల్లో విధులు నిర్వహించే అర్చకులు తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని శ్రీవేంకటేశ్వర ఆయుర్వేద కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. టీటీడీ ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు శ్రీవేంకటేశ్వర ఉద్యోగుల శిక్షణ సంస్థ (శ్వేత) ఆధ్వర్యంలో ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో జరుగుతున్న శిక్షణా తరగతులు రెండవ రోజైన బుధవారం మన ఆరోగ్యం మన చేతుల్లోనే అనే అంశంపై ఆయన మాట్లాడుతూ వైద్యశాస్త్రంలో వ్యాయామానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. అర్చకులు నిత్యం యోగ, ధ్యానం, వ్యాయామం చేయడం ద్వారా ఒత్తిడిని దూరం చేసుకోవచ్చునని తెలిపారు. అనంతరం తిరుమల శ్రీవారి ఆలయ అర్చకులు రామకృష్ణదీక్షితులు వైఖానస ఆగమంలోని విశేషాలను అర్చకులకు విపులీకరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ వైఖానస ఆగమ సలహాదారు పి. సీతారామాచార్యులు, టీటీడీ ఆలయాల వైఖానస అర్చకులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత రంగాలకు రుణాలివ్వండి



తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 7: జిల్లాలో వ్యవసాయం, విద్య, పరిశ్రమలు వంటి ప్రాధాన్యత రంగాలకు లక్ష్యం మేరకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ లక్ష్మీశా బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలతో పాటు వ్యవసాయం, విద్య, పరిశ్రమలు వంటి రంగాలకు సమష్టిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. పీఎంఈజీపీ రుణాలు అందజేయడంలో రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉన్నామని అభినందించారు. కొంతమంది బ్యాంకర్లు బాగా రుణాలు అందజేస్తూ లక్ష్యానికి మించి పనితీరు కనబరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్డీఎం సుభాష్, ఆర్‌బీఐ ఎల్డీవో పూర్ణిమ, బ్యాంకు అధికారులు శేషగిరిరావు, శ్రీనివాసులు, జయకుమార్, సునీల్, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, మెప్మా పీడీ రాధమ్మ పాల్గొన్నారు.

రేపు 'మిణుగురులు' పుస్తక పరిచయ సభ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 7: మిణుగురులు పుస్తక పరిచయ కార్యక్రమం ఎస్వీయూలో ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులో పుస్తక రచయిత్రి ప్రొఫెసర్ చల్లపల్లె స్వరూపరాణి, హెచ్‌సీయూ ప్రొఫెసర్ కేవై రత్నం, రచయిత, పాత్రికేయులు డాక్టర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు, బహుజన రచయితల వేదిక కన్వీనర్ డాక్టర్ నూకతోటి రవికుమార్, జీఎస్టీ కమిషనర్ సిద్ధార్థి సుభాష్ చంద్రబోస్, సీఐటీయూ నేత కందారపు మురళి పాల్గొంటారు. వర్సిటీ ఎస్సీ ఎస్టీ విద్యార్థుల సంఘం - దళిత సాహిత్య వికాస వేదిక సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు పి. అంజయ్య తెలిపారు.

నేటి నుంచి మహారుద్రాభిషేక సహిత శ్రీదేవి పూజ

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 7: దత్తోపాసకులు సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో మహారుద్రాభిషేక సహిత శ్రీదేవి పూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీపద్మావతి కల్యాణమండపం-2లో మాసశివరాత్రి సందర్భంగా గురువారం 1,500సార్లు నమక చమకాలతో మహారుద్రాభిషేకం నిర్వహిస్తారని పేర్కొన్నారు. శుక్రవారం కామాక్షి అమ్మవారికి 10 వేలసార్లు దుర్గాసూక్తంతో అభిషేకిస్తారని, ఇందులో భాగంగా చండీపారాయణం, చండీహోమం, రుద్ర, నక్షత్ర, నవగ్రహ, వాస్తు, లక్ష్మీ గణపతి హోమం వంటివి నిర్వహిస్తారని వెల్లడించారు. ఉదయం 7 గంటల నుంచి హోమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ఎవరిని మభ్యపెట్టేందుకు డీఎస్సీ?

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 7: ఐదేళ్ల పాలనలో ఒక్క ఉద్యోగం కూడా భర్తీచేయకుండా ఎన్నికల ముందు హడావుడిగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటన జారీ చేయడం ఎవరిని మభ్యపెట్టేందుకని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు ఓ ప్రకటనలో అధికార పార్టీని ప్రశ్నించారు. తూతూమంత్రంగా 6,100 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ కావాలని నిరుద్యోగులు పోరాడుతున్నా పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత సిద్ధంగా ఉండాలని కోరారు.

29లోపు లైసెన్స్‌లు పొందండి


సమావేశంలో మాట్లాడుతున్న బాలూనాయక్

తిరుపతి, ఫిబ్రవరి7: జిల్లాలోని దుకాణాల యజమానులు, వ్యాపార సంస్థల నిర్వాహకులు వ్యాపార సంస్థలకు సంబంధించి ఈ నెల 29వ తేదీలోపు లైసెన్స్‌లు పొందాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.బాలూనాయక్ విజ్ఞప్తి చేశారు. అన్నమయ్య మార్గ్‌లోని కార్మిక శాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో బుధవారం ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇతర వ్యాపార సంస్థల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. దుకాణాల యజమానులు ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు, సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు లభిస్తాయని తెలిపారు. అక్కడే తగిన రుసుం చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ అధికారులు జె.శ్రీమన్నారాయణ, ఎం.రాజయ్య, ఛాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు మోహన్‌రాజు, మంజునాథ్, చక్రపాణి, దొరైరాజు, మలిశెట్టి, శ్రీధర్‌బాబు, ప్రసాద్‌బాబు, శివప్రసాద్, శ్యాంసుందర్, సత్యనారాయణలు పాల్గొన్నారు.

కారు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

చంద్రగిరి, ఫిబ్రవరి 7: చంద్రగిరి ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 19 నుంచి 30 రోజులపాటు పురుషులకు, మహిళలకు కారు డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు కలిగిన నిరుద్యోగులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. కనీసం పదో తరగతి చదివి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 7989680587, 9494951289 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి: పాశం



టీడీపీలో చేరిన వారితో పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దెదించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పేటేటి శ్రీనివాసులు, ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో వివిధ పార్టీల నుంచి పలువురు టీడీపీలో చేరారు. వారికి పాశం సునీల్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో విసిగిపోయిన యువత, మహిళలు భారీగా టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో అవినీతి, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో నిరుద్యోగులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నిరుద్యోగభృతి అందజేడం జరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా చంద్రబాబునాయుడుకే ఉందన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి టీడీపీని గెలిపించుకుని చంద్రబాబునాయుడిని సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. సుధీర్, దుర్గారావు, సాంబమ్మ, వెంకమ్మ, అశోక్‌బాబు, శ్రీనివాసులు, ప్రసాద్, వినోద్ తదితరులకు పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, నరసిహులు, ఇశ్రాయిల్‌కుమార్, రవీంద్రరెడ్డి, ఔరంగ్‌బాషా, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, వెంకటేష్, సునీల్, సందీప్, వెంకటసాయి, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా వ్యతిరేక ప్రభుత్వాన్ని సాగనంపుదాం: నెలవల



కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, ఫిబ్రవరి 7: మహిళలను ఆర్థికంగా అణగదొక్కుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని చెన్నప్పనాయుడుపేట పంచాయతీ పరిధిలోని పత్తిపాడు వడ్డిపాళెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా వ్యతిరేక ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను మభ్య పెడుతున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వ దాష్టీకాలకు అడ్డుకట్ట వేసే రోజులు దగ్గర పడ్డాయని స్పష్టం చేశారు. టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఆయన ఉద్ఘాటించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు, వేలూరు హరినాయుడు, రాధానాయుడు, రమణయ్య, ప్రసాదరాజు, గోపాల్‌కృష్ణ, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే భూ కబ్జాలు

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 7: మున్సిపాలిటీ పరిధిలో కోట్లాది రూపాయలు విలువ కలిగిన భూములు అధికారులు నిర్లక్ష్యతనే కబ్జాకు గురవుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అన్నారు. బుధవారం అత్యవసర కౌన్సిల్ సమావేశంలో నిర్వహించారు. అధికారులు అవినీతికి పాల్పడుతూ కోట్లాది రూపాయలు విలువ గల ప్రభుత్వ భూములకు దొంగ పట్టాలు అందజేస్తున్నారని కౌన్సిర్లు ధ్వజమెత్తారు. జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో సమగ్ర విచారణ నిర్వహించాలని కోరారు. ఎన్‌జేఆర్ సర్కిల్, మున్సిపాలిటీ వద్ద ఉన్న ప్రభుత్వ భూములను రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు సర్వే చేసి వాటి పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ల క్రయవిక్రయాల్లో అవకతవకలపై విచారణ



రికార్డులను తనిఖీ చేస్తున్న ఈఈ రమేష్ చౌదరి

కోట, ఫిబ్రవరి 7: కోట మండల పరిధిలోని విద్యానగర్ ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయంలో ట్రాన్స్‌ఫార్మర్ల క్రయవిక్రయాల్లో అవకతవకలపై ఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ చౌదరి బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022లో వాకాడు మండలంలో అప్పటి ట్రాన్స్‌కో అధికారుల ఆధ్వర్యంలో రొయ్యల రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల విక్రయాలు, కొనుగోళ్ల అవకతవకలు జరిగినట్లు తెలిపారు. రూ.50 లక్షల విలువచేసే ట్రాన్స్‌ఫార్మర్లు పక్కదారి పట్టాయి. దీంతో అక్కడ పనిచేసే లైన్‌మెన్, లైన్ ఇన్స్‌స్పెక్టర్‌ను అప్పట్లో ట్రాన్స్‌కో సస్పెండ్ చేసింది. అదే విధంగా ఏడీఈని తిరుపతికి బదిలీ చేశారు. విచారణను మరింత వేగవంతం చేసేందుకు రికార్డులను తనిఖీ చేశామని ఈఈ రమేష్ చౌదరి తెలిపారు.

టికెట్ల కేటాయింపులో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

బాలాయపల్లి, ఫిబ్రవరి 7: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో టీడీపీ టికెట్ల కేటాయింపులో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని బీసీ సంఘ నేత గెరిటి చెంచయ్య కోరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలు అండగా ఉన్నారని చెప్పారు. తిరుపతి, నెల్లూరు జిల్లాలో చూస్తే బీసీలకు ఒక టికెట్ కూడా కేటాయించలేదన్నారు. వెంకటగిరి నియోజకవర్గం నుంచి బీసీ అభ్యర్థికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మన్నారపు వెంకటరత్నం, మారెళ్ల వెంకటాద్రి, సత్తల గిరిప్రసాద్, రామచంద్రయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

గూడూరు, ఫిబ్రవరి7: మండలంలోని కందలి గ్రామంలో అనుమానాస్పదస్థితిలో వృద్ధుడు మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ వివరాల మేరకు... కందలి గ్రామం అరుంధతీయవాడకు చెందిన రమణయ్య(60) మంగళవారం గ్రామ సమీప పొలాల్లో మేకలను మేపుకునేందుకు వెళ్లాడు. పొలాల్లోనే మృతి చెంది ఉండడంతో స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

గూడూరు, ఫిబ్రవరి 7: మండలంలోని గాంధీనగర్ సమీపంలో గల టిడ్కోగృహాల్లో బుధవారం ఓ యువతి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ వివరాల మేరకు... టిడ్కో గృహాల్లో నివాసముంటున్న సుభాషిని కుమార్తె సుప్రియ(17) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

ఓటర్ల జాబితాలో తప్పుల సవరణకు చర్యలు

కలెక్టర్ లక్ష్మీశా



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశా

చిల్లకూరు, ఫిబ్రవరి 7: ఓటర్ల జాబితాలలో తప్పులను సవరించేందుకు చర్యలు తీసుకోవాలని మండల అధికారులను కలెక్టర్ లక్ష్మీశా ఆదేశించారు. బుధవారం చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలోని 114, 115 పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరణించిన, డూప్లికేట్ ఎంట్రీలను గుర్తించి ఓటర్ల జాబితాను సరిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో త్వరితగతిన వసతులను మెరుగుపరచాలని సూచించారు. అనంతరం పాఠశాలలో వసతులు, బోధనా విధానాలు, మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సామర్థ్యాలతో కూడిన బోధనను అదించాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపి వారి భవిష్యత్తుకు బంగారుబాట వేయాలని కోరారు. అంతకుముందు చింతవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రిజిస్టర్లను, వార్డును పరిశీలించారు. ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మధ్యాహ్నం తరువాత స్థానిక మండల కార్యాలయ ఆవరణలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొని అర్జీలను స్వీకరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్‌కుమార్, డీఈవో శేఖర్, డీఎంహెచ్‌వో శ్రీహరి, డిప్యూటీ ఈవో శివప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు సరే.. స్థలం ఎక్కడ?

తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమసానిగుంట మహిళల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 7: తమకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకు స్థలం ఎక్కడుందో చూపాలంటూ వెంకటగిరి మండల పరిధిలోని సోమసానిగుంట గ్రామానికి చెందిన మహిళలు బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం తమకు జగనన్న లే అవుట్ పేరుతో అధికారులు ఇంటి పట్టాలు అందజేశారని తెలిపారు. అయితూ పట్టా కాగితాల్లో ఉన్న సర్వే నెంబరులో బీడు భూమి తప్ప లేఅవుట్ వేయలేదన్నారు. ఇళ్ల నిర్మించుకోవడానికి స్థలం ఎక్కడుందో తెలీక పలుమార్లు అధికారులను కలిసి సమస్య వివరించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు, ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేశారు.

గోతుల దారిలో ప్రయాణమెలా?



చెన్నూరు వద్ద అధ్వానంగా ఉన్న రహదారి

గూడూరు, ఫిబ్రవరి 7: మండలంలో పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు గోతులమయంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గూడూరు నుంచి చెన్నూరుకు వెళ్లే రోడ్డు గతేడాది నవంబరులో కురిసిన వర్షాల కారణంగా గుంతలయమంగా మారింది. ఈ మార్గంలో చెన్నూరు, తిప్పవరప్పాడు, వెంకటగిరి, రాపూరు గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. చెన్నూరు సమీపంలో రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారడంతో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు తప్పడంలేదని వాహనదారులు చెబుతున్నారు. అదేవిధంగా స్థానిక బీసీ కాలనీ సమీపంలో వేములపాళెం వెళ్లే రోడ్డు, చవటపాళెం నుంచి దివిపాళెం వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో గుంతలు కనిపించక ప్రమాదాలకు లోనవుతున్నామని అంటున్నారు. అధికారులు స్పందించి రహదారులను అభివృద్ధి పరచాలని కోరుతున్నారు.

పోలీసుల నిర్బంధంలో ఆశావర్కర్లు

గూడూరు, ఫిబ్రవరి 7: విజయవాడలో గురువారం జరిగే నిరసన కార్యక్రమానికి వెళుతున్న ఆశావర్కర్లను బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఒకటో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వెంకటగిరి, సూళ్లూరుపేటకు చెందిన ఆశావర్కర్లు రైళ్లలో వెళుతుండగా పోలీసులు గుర్తించి స్థానిక ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐటీయూ నాయకులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఆశావర్కర్లకు మద్దతు తెలిపారు.

తిరుపతిని రాజధాని చేయాలి: చింతా



గూడూరులో మాట్లాడుతున్న మాజీ ఎంపీ చింతామోహన్

గూడూరు, ఫిబ్రవరి 7: రాష్ట్రానికి తిరుపతిని రాజధానిగా చేయాలంటూ మాజీ ఎంపీ చింతామోహన్ బుధవారం గూడూరు పట్టణంలోని టవర్‌క్లాక్ కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అమరావతిని రాజధానిగా ప్రకటిస్తే, సీఎం జగన్ విశాఖపట్టణాన్ని రాజధానిగా చేయాలని చూస్తున్నారని, అయితే ప్రజలందరూ తిరుపతిని రాజధాని చేయాలని కోరుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పంటా శ్రీనివాసులురెడ్డి, పూల చంద్రశేఖర్, బ్రహ్మయ్య, సుబ్బరామరాజు, భాస్కర్, నేహ్మియా తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని పోలేరమ్మ గుడివద్ద నిరసన తెలిపారు. విలేకర్లతో ఆయన మాట్లాడారు. బ్రహ్మంగారు చెప్పినట్లు తిరుపతి రాజధాని అవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు నాగూర్, గాడి వెంకటయ్య, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం ఆదేశిస్తే పోటీ చేస్తా: దూర్తటి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని పీసీసీ మాజీ కార్యదర్శి దూర్తటి మధుసూదనరావు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో కొందరు నాయకులు ఎన్నికల సమయంలో హడావిడి చేసి వెళ్లిపోవడం వల్ల నియోజకవర్గంలో పార్టీని నడిపే నాయకుడు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విభజనంతరం 2014లో తాను కాంగ్రెస్ నుంచి పోటీ చేశానని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో అవకాశం ఇస్తే పోటీ చేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట్రావ్, ఎస్కే నాగూరు, గాడి వెంకటయ్య, అల్లాద్దీన్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

'పల్లెకు పోదాం'ను విజయవంతం చేయండి

కోట, ఫిబ్రవరి 7: కోట మండలంలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో జరిగే పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.నాయకులు అంబరీషా, వెంకటేశ్వర్లు, తిరుపాలయ్య, శ్రీనివాసులు, మహేష్, పరుశురాంసాయి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి



నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 7: నాయుడుపేట డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయన చిత్తూరు ఎస్బీ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలతో క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు.

బాలాయపల్లి తహసీల్దారుగా పుల్లారావు

బాలాయపల్లి, ఫిబ్రవరి 7: బాలాయపల్లి తహసీల్దారుగా పుల్లారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు తిరుపతి కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. గుంటూరు జిల్లా నరసారావుపేటలో పనిచేస్తున్న పుల్లారావు బాలాయపల్లికి వచ్చారు. కొత్త తహసీల్దారుకు రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికి సత్కరించారు.

చిట్టమూరు తహసీల్దారుగా శ్రీనివాసశర్మ

చిట్టమూరు, ఫిబ్రవరి 7: చిట్టమూరు తహసీల్దారుగా శ్రీనివాసశర్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు డీటీ నిరంజన్‌కుమార్, ఆర్‌ఐ మధులత, సర్వేయర్ లక్ష్మీనారాయణ, వీఆర్‌వోలు, సిబ్బంది స్వాగతం పలికారు.

వాకాడు ఏపీఎంగా మాధవి

వాకాడు, ఫిబ్రవరి 7: వాకాడు మండల ఏపీఎంగా మాధవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో సీసీగా విధులు నిర్వహిస్తూ ఏపీఎంగా పదోన్నతి పొందిన ఆమెను సీసీలు అభినందించారు. కార్యక్రమంలో సీసీలు మురళి, వెంకటసుబ్బయ్య, భూదేవి, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 7: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వర్ణముఖినది నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండటంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని ఎస్ఈబీ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

సిలికా లారీల అడ్డగింత

చిల్లకూరు, ఫిబ్రవరి 7: మండలంలోని రామారెడ్డిపాళెం గ్రామస్తులు బుధవారం సాయంత్రం సిలికా లారీలను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం మీదుగా సిలికా లారీ వెళ్లే సమయంలో దుమ్ములేచి సమీపంలో ఉన్న ఇళ్లలోకి చేరుతోందన్నారు. ఇళ్లలో దుమ్ము నిండిపోయి కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు చర్యలు తీసుకుని దుమ్ము ఇళ్లలోకి చేరకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి



కరపత్రాలు అందజేస్తున్న పాశం సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 7: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. బుధవారం స్థానిక సాధుపేటలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రం అన్ని రంగాల్లో వెనకబడి పోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అక్రమాలు, అరాచకాలను ప్రజలకు వివరించి టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో నరసింహులునాయుడు, చంద్రమౌళి, రమేష్‌నాయుడు, మోహన్, శ్రీధర్, రత్నం, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, అబ్దుల్ రహీం, జనార్దనరెడ్డి, భారతి, కల్పన, సుప్రజ, సుధా తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే భవిష్యత్



మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న కిషోర్‌నాయుడు

చిట్టమూరు, ఫిబ్రవరి 7: చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేస్తేనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందని టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ ఇంటింట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని అరవపాళెం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, చిన్నారావు, గిరినాయుడు, కస్తూరయ్య, చెంచురామయ్య ఆచారి, మణి, మురళీధర్, ముత్తు, దేవుడు తదితరులు ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీరుకు అభినందన

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 7: సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీరు కె.చందన ఢిల్లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్‌లో పాల్గొంది. బుధవారం కళాశాలకు తిరిగి వచ్చిన చందనకు ఘనంగా సన్మానించి అభినందించారు. ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, ఎన్ఎస్ఎస్ అధికారులు ఏడుకొండలు, శ్రీనివాసులు, ఎస్‌ఐ రహీం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చందనకు అభినందిస్తున్న కళాశాల బృందం

ఉదయం బాధ్యతల స్వీకరణ... సాయంత్రం రిలీవ్



శ్రీనివాసగౌడ్

పుత్తూరు, ఫిబ్రవరి 7: పుత్తూరు తహసీల్దారుగా శ్రీనివాసగౌడ్ బుధవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. కర్నూల్ జిల్లా డోన్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన ఎన్నికల నేపథ్యంలో రాత్రీ పగలు బాధ్యతలు ఎక్కువగా వుంటాయని భావించి ఇక్కడే నివాసం ఉండేందుకు అద్దె ఇల్లు కూడా చూసుకున్నారు. అయితే మధ్యాహ్నానికే అన్నమయ్య జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్వర్వులు రావడంతో అవాక్కయ్యారు. చేసేది ఏమీ లేక ఉన్నతాధికారుల ఆదేశం మేరకు రిలీవ్ అయ్యారు.

సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రామానాయుడు

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 7: దేశవ్యాప్తంగా ఈనెల 16న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ప్రజా సంఘాలు, సీపీఎం, సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకుడు రామానాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, సీఐటీయూ నాయకుడు వెంకటేష్, టీఎన్‌టీయూసీ నాయకులు మాధవ నాయుడు మాట్లాడుతూ కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజానీకాన్ని సన్నద్ధం చేయడం కోసం ఫిబ్రవరి 16న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, గోపి, ధనమ్మ, సెల్వరాజ్ ఆచారి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్నొన్నారు.

పుత్తూరు వార్తలు

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్

వడమాలపేట, ఫిబ్రవరి 7: ప్రభుత్వం జగనన్న కాలనీల్లో పేదలకు అందజేసిన ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎస్‌బీఆర్ పురం సచివాయలంలో బుధవారం చేపట్టారు. 15 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసి ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోష్ణ, వీఆర్‌వో చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణపై అవగాహన

వడమాలపేట, ఫిబ్రవరి 7: మండలంలోని శ్రీబొమ్మరాజపురం గ్రామంలో బుధవారం మామిడిలో సమస్య రక్షణ చర్యలపై పుత్తూరు ఉద్యానవన శాఖాధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. పూత ఆలస్యం అవుతున్నందున్న ఏ మందులు వాడాలి, పూత, పిందె దశలో చీడపీడలు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. ఉద్యానవన శాఖాధికారి సౌజన్య, రైతు భరోసా, కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారులు

ముద్దుకృష్ణమ ఆశయాలను కొనసాగిస్తా: భానుప్రకాష్



పుత్తూరులో ముద్దుకృష్ణమ నాయుడు సమాధికి పూజలు చేస్తున్న గాలి సరస్వతమ్మ, గాలి జగదీష్ - వడమాలపేటలో నివాళులర్పిస్తున్న గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 7: మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు ఆశయాలను ఆయన కుమారుడిగా కొనసాగిస్తానని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. బుధవారం ముద్దుకృష్ణమ ఆరవ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని కేవీఎన్ రోడ్డు కూడలిలో చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి ముద్దుకృష్ణమ జీవించి ఉన్నంత కాలం ప్రజల కోసమే పరితపించినట్లు చెప్పారు. పుత్తూరు, నగరి అభివృద్ధిలో ఆయన గుర్తులు ఎన్నటికీ చెరిగిపోవన్నారు. కుటుంబం కన్నా నియోజకవర్గ ప్రజలకే అందుబాటులో ఉన్నారని కొనియాడారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మధవయ్య, పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీఎస్ గణేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మాధవనాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ యుగంధర్, సర్పంచు బొబ్బిలియాదవ్, కరుణాయాదవ్ పాల్గొన్నారు.

పుత్తూరు: ముద్దుకృష్ణమ నాయుడు సమాధి వద్ద ఆయన భార్య గాలి సరస్వతమ్మ, చిన్న కుమారుడు గాలి జగదీష్ పూజలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శివశంకర నాయుడు, విజయశేఖర్, నెట్టేరి శివ, ఆలమ్‌సాయి, హరీష్, కరుణాకర్ చౌదరి పాల్గొన్నారు.

వడమాలపేట: మండల కేంద్రంలో ముద్దుకృష్ణమనాయుడు చిత్రపటానికి నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. అన్నదానం చేశారు. నియోజకవర్గ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో నాయకులు ధనంజయులు నాయుడు, జానా వెంకటయ్య, భాస్కర నాయుడు, హేమావతి, పెద్దబ్బరాజు, లక్ష్మీప్రసన్న, మునిరత్నం, ధనలక్ష్మి, హేమాద్రి, దాముయాదవ్, వెంకటేశ్వరరావ్, నారాయణరాజు, అంజయ్య, ఉమాపతి, బత్తయ్య, సుకుమర్ ,శేషాద్రినాయుడు, ఆదినారాయణరాజు, దేవ, శివరాయల్, మురళీరెడ్డి, చైతన్య, చందు, గురునాధం శెట్టి, బాలకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు


సమావేశంలో మాట్లాడుతున్న దశరధాచారి

నేటి జయహో బీసీ సభకు తరలిరండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7: జయహో బీసీ సభకు పెద్దయెత్తున ప్రజలు తరలిరావాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దశరధాచారి పిలుపునిచ్చారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం జయహో బీసీ సభ నిర్వహణపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దశరధాచారి మాట్లాడుతూ...బీసీ వర్గాలకు మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ పాశవిక దాడులకు పాల్పడుతున్నాడని దశరధాచారి ఆరోపించారు. గురువారం టీడీపీ కార్యాలయంలో జరిగే జయహో బీసీ సభలో విజవంతం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు రేణుకాదేవి, డా.ఉమేష్ రావు, వన్నెకుల క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల్ రవి, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్ జీతాలివ్వాలి


నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్స్

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 7: మండలంలో పనిచేస్తున్న స్వచ్ఛ భారత్ పంచాయతీ కార్మికులకు 24 నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు చిన్నిరాజ్ బుధవారం కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 నెలలు గడిచినా స్వచ్ఛ భారత్‌కార్మికులకు జీతాలివ్వకపోవడం బాధాకరమన్నారు. స్వచ్ఛభారత్ కార్మికుల జీతం రూ.6వేలు నుంచి రూ.10వేలుకు పెం చుతూ జీవో జారీ చేసినా ఇంత వరకు అమలుకు నోచుకోలేన్నారు. వారికి పనిభద్రత కల్పించి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.26వేలు ఇవ్వాలని, వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నాదురై, చంద్ర, మునిచంద్ర, వెంకట్రావు, లక్ష్మమ్మ, స్వచ్ఛభారత్ కార్మికులు పాల్గొన్నారు.

వేదనారాయణస్వామికి గరుడ వాహన విరాళం


గరుడ వాహనానికి హారతి పడుతున్న ఆలయ అధికారులు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 7: నాగలాపురంలోని సుప్రసిద్ధ టీటీడీ అనుబంధ ఆలయమైన వేదనారాయణస్వామి ఆలయానికి తమిళనాడులోని పెరియపాళెంకు చెందిన తిరుమల పాదయాత్ర భక్తులు రూ.2లక్షల విలువైన గరుడ వాహనాన్ని విరాళంగా అందజేశారు. డిప్యూటీ ఈవో దాతల నుంచి గరుడ వాహనాన్ని అందుకున్నారు. డిప్యూటీ ఈవోతో పాటు దాతలు గరుడ వాహనానికి హారతులు పట్టారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

పిచ్చాటూరు, ఫిబ్రవరి 7: మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో పీఎంకే బాబు అధ్యక్షతన డాక్టర్ అరుణ్‌కిషోర్ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నదురై సుధా, జడ్పీటీసీ సుమతి, మహేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సింధూ శ్యామ్, నాయకులు మదన్మోహన్‌రెడ్డి, దేశప్పన్, దానివేలు, ఏళుమలై పాల్గొన్నారు.

అందరి సహకారంతో బాల్య వివాహాల నిర్మూలన

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 7: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం రోజున బాల్య వివాహాలు జరగకుండా అందరి సహకారం అవసరమని సీడీపీవో దేవకుమారి కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం బాల్యవివాహాల నిర్మూలన కార్యక్రమంపై అంగన్‌వాడీలు, మహిళాపోలీసు సంరక్షకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రతాప్ మాట్లాడుతూ మండలంలో ఉన్న శివాలయాల్లో కల్యాణోత్సవం రోజున బాల్యవివాహాలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు స మాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు, సూపర్‌వైజరు జ్యోతి, వైద్యాధికారి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తే కఠిన చర్యలు


హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసిన రెవెన్యూ సిబ్బంది

తొట్టంబేడు, ఫిబ్రవరి 7: శ్రీకాళహస్తి మండలంలోని చల్లపాళెంలో కొందరు చెరువు గుంట కబ్జాకు యత్నించి గుంటను పూడ్చారు. బుధవారం రెవెన్యూ అధికారులుఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

ప్రజలను చైతన్యవంతులను చెయ్యడమే లక్ష్యం


అంగన్‌వాడీల సేవలపై అవగాహన కల్పిస్తున్న కళాకారుల బృందం

తొట్టంబేడు, ఫిబ్రవరి 7: పాటలు, నాటికల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చెయ్యడమే లక్ష్యంగా కళాకారుల బృందం పనిచేస్తుందని ప్రగతి సంస్థ సభ్యుడు ప్రబాకర్ అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని రామానుజపల్లె, పాపణపల్లె గ్రామాల్లో బుధవారం పూర్వప్రాథమిక విద్యపై అంగన్‌వాడీ కేంద్రాల్లో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు కళాకారుల బృందం, ప్రగతి సంస్థ సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టువ్యాధి ఒకరి నుంచి ఒకరికి వ్యాపించదు


ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 7: కుష్టువ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదని, దీనిపై భయాందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్ దివాకర్ తెలిపారు. మండలంలోని తెత్రిపాడు గ్రామంలో కుష్టువ్యాధి నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యూపిఎస్ టీమ్ సభ్యులు డాక్టర్ రాజా, డీపీఎంవో జోబు, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7: పట్టణంలోని కసా గార్డెన్ గురుకుల పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రభావతి బుధవారం ప్రకటనలో తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ఆంగ్ల మాధ్యమంలో చేరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఈ నెల 10వ తేదీ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

తొట్టంబేడు, ఫిబ్రవరి 7: మండలంలోని కొత్తకండ్రిగ క్రాస్ వద్ద మద్యం తరలిస్తున్న కెవిబిపురం మండలం కోవనూరుకి చెందిన చెంగయ్యను పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్న ఎస్సై రాఘవేంద్ర కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఏర్పేడు: ముసలిపేడు పంచాయతీ బత్తినయ్య గిరిజనకాలనీలో పోలీసులు మద్యం స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న బాలకృష్ణ అనే వ్యక్తి వద్ద బుధవారం ఏర్పేడు ఎస్ఐ జిలాని 15మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రాజధానిగా తిరుపతి ఆమోదయోగ్యం

● మాజీ ఎంపీ చింతా


మాట్లాడుతున్న చింతా మోహన్

సత్యవేడు, ఫిబ్రవరి 7: తిరుపతిని రాష్ట్ర రాజధానిగా ఏర్పాటు చేయడమే అన్నిటికి ఆమోదయోగ్యమని మాజీ ఎంపీ చింతామోహన్ పేర్కొన్నారు. బుధవారం సత్యవేడు మండలం నీలి తొట్టికండ్రిగ, అమాసరెడ్డి కండ్రిగ, పెద్ద ఈటిపాకం తదితర గ్రామాల్లో చింతామోహన్ ఆధ్వర్యంలో మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్‌కు రాజధానిగా తిరుపతిని ఏర్పాటు చేయడమే శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుషోత్తం, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తేజవతి, తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ కోరారు. వరదయ్యపాళెం మండలంలోని యానాదివెట్టు పంచాయతీలోని ఎస్సీ కాలనీ, కంచరపాళెం, బత్తలవల్లం పంచాయతీలో పల్లెపల్లెకు మార్పు రావాలి కాంగ్రెస్ రావాలి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రచారంచేశారు.

రేణిగుంటకు తహసీల్దారు ఎవరు ?

రేణిగుంట,ఫిబ్రవరి7: మండల తహసీల్దారుగా ఇప్పటివరకు ఎవరూ బాధ్యతలు స్వీకరించక పోవడంతో తమ సమస్యలు ఎవరు పరిష్కరిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రేణిగుంట మండలంలోవున్న ఉదయ్‌సంతోష్‌ను కర్నూలు జిల్లాకు , రే ణిగుంటకు వైఎస్ఆర్‌జిల్లా సికె దిన్నె మండలంలో వున్న నారాయణరెడ్డిని బదిలీ చేశారు. ఆయన ఇప్పటి వరకు రేణిగుంటలో బాధ్యతలు తీసుకోలేదు. ఈయనతోపాటు బదిలీ అయిన అధికారులంతా మూడు రోజులముందే ఆయా మండలాల్లో విధుల్లో చేరారు. రేణిగుంటలో తహసీల్దారు బాధ్యతలు స్వీకరించక పోవడంతో ఎన్నికల సమయంలో అధికారులు ఈమండలంలో విధులు నిర్వహించడానికి భయపడుతున్నారేమోనని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులకు ఈ అధికారిపట్ల సుముఖంగా లేరా అనే అనుమానం వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా రెవెన్యూ పరమైన సమస్యల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని ప్రజలు వాపోయారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి వెంటనే తహసీల్దారును నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

రేణిగుంటలో తాగునీటి సమస్య పరిష్కరించని ఎమ్మెల్యే: జనసేన


బుగ్గవీధిలో ప్రచారం చేస్తున్న కోటా వినూత

రేణిగుంట,ఫిబ్రవరి7: మండల కేంద్రమైన రేణిగుంట మేజర్ పంచాయతీలో గత నాలుగు నెలలుగా ప్రజలు ఎదుర్కొంటున్న నీటిసమస్యను పరిష్కరించడంలో ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి విఫలమయ్యారని శ్రీకాళహస్తి నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ వినూత విమర్శించారు.బుధవారం రేణిగుంట బుగ్గవీధి మిరియాలబాబా వీధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ,జనసేన ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. జనసేన మండలపార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకుంది ముచ్చివోలు వాసి

ఏర్పేడు, ఫిబ్రవరి 7: మండలం నచ్చనేరి పంచాయతీ దుర్గిపేరి శ్మశానవాటిక సమీపంలో ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామవాసిగా పోలీసులు గుర్తించారు. అన్ని దినపత్రికల్లో మృతదేహంతో పాటు వార్త ప్రచురితం కావడంతో ఆయన కుటుంబసభ్యులు గుర్తించి ఏర్పేడు పోలీసులను కలిశారు. మృతుడు శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామమని చెంచురామయ్య(45)గా గుర్తించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ జిలాని తెలిపారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

పిచ్చాటూరు, ఫిబ్రవరి 7: మండలం తహసీల్దార్‌గా డి.హుస్సేన్ సాహెబ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా హులగుండ మండలం నుంచి ఆయన బదిలీపై పిచ్చాటూరుకు వచ్చారు. పిచ్చాటూరు మండలంలో పనిచేసే తహసీల్దార్ మధుసూదన్‌రావు కడప జిల్లా బద్వేల్ మండలానికి బదిలీ అయ్యారు. నూతన తహసీల్దార్‌కు ఆర్ఐ సుధాకర్, వీఆర్వో నాగభూషణం శుభాకాంక్షలు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను చూసి ఓటెయ్యండి


ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

తొట్టంబేడు, ఫిబ్రవరి 7: కేంద్ర ప్రభుత్వ పథకాలను చూసి ఓటెయ్యాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ కో కన్వీనర్ ఎం.సుబ్రమణ్యంరెడ్డి అన్నారు. మండలంలోనికల్లిపూడి, తాటిపర్తి, మల్లిగుంట గ్రామాలలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెడెంక్రిష్ణయ్య, రవిఆచ్చారి, మునిరాజ, రవిచంద్ర, బిందు, లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పేరుతో కుల సంఘం నేత వసూళ్లు...?



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7: ఇళ్ల స్థలాల పేరుతో ఓ కుల సంఘం పేదల నుంచి డబ్బు వసూలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఓ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు పేదల నుంచి నగదు స్వాహా చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. శ్రీకాళహస్తి పట్టణ శివారు రాజీవ్ నగర్ లోని చెంచులక్ష్మి కాలనీలో బియ్యపు మధుసూదన్ రెడ్డి బ్లాకులో గిరిజన సామాజిక వర్గ ప్రజలకు ఇంటి స్థలాలు ఇస్తానని కుల సంఘం నాయకుడు నగదు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. సుమారు 45 మంది బాధితులు నగదు చెల్లించినా, ఇప్పటివరకు స్థలాలు చూపలేదని వాపోతున్నారు. కుల సంఘం నాయకుడు అధికార పార్టీ ముఖ్య నాయకుడి వెంట నిత్యం తిరుగుతుండడంతో నిరుపేదలైన ఆ గిరిజనులు ప్రశ్నించేందుకు భయపడుతున్నారని సమాచారం.

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి


అధికారులతో సమీక్షిస్తున్న ఆర్వో రామ్మోహన్

సత్యవేడు, ఫిబ్రవరి 7: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి రామ్మోహన్ కోరారు. సత్యవేడు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని వివిధ పార్టీల నాయకులు, పోలీసు, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో సార్వత్రిక ఎన్నికల జరుగనున్న నేపథ్యంలో అధికారులు వారి విధులపై అవగాహన కలిగి ఉండాలని, ఓటర్ల తుది జాబితా 22 జనవరి 2024 నాటి ప్రతిని పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించాలన్నారు. తుది జాబితా ప్రచురితమైన వాటిలో ఏదైనా అభ్యంతరాలు పొరపాట్లు, చనిపోయిన వారు ఉంటే వాటిని వెరిఫై చేయాలని, ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే ఆదేశాలు పాటించాలని సూచించారు. నెట్వర్క్ సిగ్నల్ అందుబాటులో లేని పోలింగ్ బూత్‌ల వివరాలు అందాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్లు హుస్సేన్ సాహెబ్, రామాంజనేయులు, శంకర్రావు, ఉదయభారతి, శ్రీరామ నాయక్, వివిధ రాజకీయ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై ఆర్డీవో సమీక్ష


ఓటర్ జాబితా పై చర్చిస్తున్న ఆర్డీవో రవిశంకర్ రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7: ఓటర్ జాబితాపై బుధవారం ఆర్డీవో రవి శంకర్ రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో చర్చించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో మృతుల ఓట్ల తొలగింపు, అక్షర దోషాల సవరణ అధ్యయనం చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల అభ్యర్థన మేరకు జాబితాలో మార్పులు చేస్తామని ఆర్డీవో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వోలు తదితర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ముక్కంటి దర్శనానికి గుర్తింపు కార్డులివ్వండి


చైర్మన్ శ్రీనివాసులకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7: ఆర్టీసీ ఉద్యోగులకు ముక్కంటిని దర్శించుకునేందుకు ప్రత్యేక గుర్తింపు కార్డులివ్వాలని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆలయ పరిపాలన భవనంలో ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ... తిరుమల తరహాలో శ్రీకాళహస్తిలో కూడా ఆర్టీసీ కార్మికులకు ప్రత్యేక ఐడీ కార్డులతో దర్శన భాగ్యం కల్పించే విధానం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుమార్, నరసింహులు, సునీల్ అశోక్ ఉదయ్ వెంకటాద్రి కిషోర్ గురునాథం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

తొట్టంబేడు, ఫిబ్రవరి 7: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బొజ్జల కుటుంబం చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యండని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి కోరారు. శ్రీకాళహస్తి మండలంలోని వెలంపల్లెలో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కామేష్‌యాదవ్, నాయకులు రవీంద్రనాథ్ రెడ్డి, చంచయ్యనాయుడు, క్రిష్ణారెడ్డి, వెంకటరమణ, మణియాదవ్, రాజ, క్రిష్ణాయాదవ్, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

జేసీని కలిసిన చిందేపల్లి రైతులు

ఏర్పేడు, ఫిబ్రవరి 7: మండలంలోని చిందేపల్లి పంచాయతీలో 14మంది రైతుల నుంచి 37.17ఎకరాలను రెండో విడత జగనన్న హౌసింగ్ కాలనీ కోసం ప్రభుత్వం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ 14మంది రైతులకు సగం మొత్తాన్ని అందించారు. మిగిలిన మొత్తం చెల్లించకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో బుధవరం తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ను కలిసి పూర్తి పరిహారం అందించాలని వినతిపత్రం అందించారు. రైతులకు న్యాయంచేసేందుకు కృషి చేస్తానని జేసీ హామీ ఇచ్చినట్లు రైతులు తె లిపారు.

ఉపాధి పథకంతో రైతులకు ప్రయోజనం

ఏర్పేడు, ఫిబ్రవరి 7: ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. ఏర్పేడు మండలం రాజులపాళెం పంచాయతీలో ఉపాధిహామీలో జరుగుతున్న అమృత్ సరోవర్ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. రూ.272 కూలీని ప్రతిరోజు పొందే విధంగా వేతనదారులు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే ఆత్మ శాంతి


అనుగ్రహ భాషణం చేస్తున్న యోగిని చంద్రకాళి మాతాజీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7: ఆధ్యాత్మిక చింతనతోనే ఆత్మశాంతి లభిస్తుందని నంబూరి ఆశ్రమ నిర్వాహకులు యోగిని చంద్రకాళి మాతాజీ తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో పీఠాధిపతి విద్యా స్వరూపానందగిరి స్వామి ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన యోగినీ చంద్రకాళీ మాతాజీ మానవులు ముక్తి మార్గంలో పయనించాలని చెప్పారు. కార్యక్రమంలో ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నిరంతర విద్యుత్

● ఎస్పీడీసీఎల్ సీజీఎం గురవయ్య


సబ్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీజీఎం

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 7: వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ సీజీఎం గురవయ్య తెలిపారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్ కార్యాలయంలోని రికార్డులు పరిశీలించి విద్యుత్ సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి పగటి పూట 9గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్ అందిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ వాసురెడ్డి, డీఈఈ సతీష్‌బాబు, రమేష్‌బాబు, మెహన్, ఏఈ పుణ్యకోటి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో టీడీపీకి సూపర్ విక్టరీ

● టీడీపీ ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి


కరపత్రాలు అందజేస్తున్న ఎం.ఎస్.రవి తదితరులు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 7: సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రంలో టీడీపీకి సూపర్ విక్టరీ ఖాయమని ఆ పార్టీ జిల్లా ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్. రవి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అడవి కొడియంబేడులో బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను ప్రాధేయపడ్డారు. కార్యక్రమంలో కుమరేష్‌తో పాటు టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సిపాయి భరోసా అందజేత


సిపాయి భరోసా అందజేస్తున్న ఎమ్మెల్సీ

ఏర్పేడు, ఫిబ్రవరి 7: మండలంలోని బండారుపల్లె గ్రామంలో తొండంబట్టు రాజేష్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం సిపాయి భరోసా కింద 52 నిత్యావసర వస్తువులను రాజేష్ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మునికృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నంరెడ్డి, మునికృష్ణారెడ్డి, అంకిరెడ్డి, దొరస్వామి, చెంగల్‌రాయులు, మణి, భాస్కర్, డాక్టర్ బాబు తతదితరులు పాల్గొన్నారు.

చిందేపల్లి చెరువు కట్టకు ముప్పు !

● వారం రోజులుగా మట్టి తవ్వకాలు
● పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు


మట్టి తవ్వడంతో చెరువు కట్టకు ఆనుకుని ఏర్పడిన గుంతలు

ఏర్పేడు, ఫిబ్రవరి 7: మండలంలోని చిందేపల్లి పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూములను మెగా కంపెనీ యాజమాన్యం తవ్వేస్తుంది. చిందేపల్లి వద్ద హౌసింగ్ కాలనీ ఏర్పాటుకు ప్రభుత్వం 400 ఎకరాలనుతీసుకుని అందులో 18వేల ఇళ్లను నిర్మిస్తోంది. అయితే ఆ గ్రామానికి చెందిన చెరువు కట్టకు ఆనుకుని ఉన్న సుమారు ఐదెకరాల ప్రభుత్వ భూమిలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి పనులు చేస్తున్న మెగా కంపెనీ యాజమాన్యం మట్టిని దోపిడీ చేస్తోంది. ఇదంతా మండల వైసీపీ నాయకులు, రెవెన్యూ అధికారుల అండదండలతో జరుగుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమి ఐదెకరాల్లో సుమారు 20మీటర్ల లోతు వరకు మట్టిని తవ్వేశారు. వర్షాకాలంలో చెరువు కట్టను సంరక్షించడానికి కలుజు తూములు వేసేందుకు రైతులు వెళ్లడానికి అవకాశం లేకుండా గుంతలు నిండిపోతాయి. మండలానికి కూతవేటు దూరంలో మట్టి, గ్రావెల్ తరలిపోతున్న చెరువు కట్టను సంరక్షించి, గ్రామాన్ని, రైతులను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోలేదని చిందేపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి వర్షాకాలానికి చిందేపల్లి చెరువు ఉంటుందో కొట్టుకుపోతుందో కూడా తెలియదని రైతులు అంటున్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి ఈ మట్టి దోపిడీ అరికట్టాలని చిందేపల్లి రైతులు వేడుకుంటున్నారు.